RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 246 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

మంగళవారం 10, జనవరి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## పోలీస్ అభ్యర్థులకు న్యాయంచేసే వరకు పోరు

- ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రేవంత్‌కు వినతి
- అండగా ఉండిపోరాడుతుమాన్న రేవంత్



హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): పోలీస్ నియామకాల్లో తమకు జరిగిన అన్యాయంపై ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సర్పంచుల సమస్యలపై ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ చేపట్టిన ధర్నాలో

మిగతా... 2లో

# ఐటీ ఉద్యోగాల్లో బెంగళూరును దాటాం

- పెట్టుబడులకు అనువైన నగరంగా హైదరాబాద్
- హైదరాబాద్‌లో సౌకర్యాలకు ప్రభుత్వం పెద్దపీట
- పెట్టుబడిదారులకు అనుకూలంగా ప్రభుత్వ నిర్ణయాలు
- హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం కాళేశ్వరం
- ఐటి ప్రతినిధుల ముఖాముఖి భేటీలో మంత్రి కెటిఆర్




హైదరాబాద్, జనవరి9(ప్రజామంటలు): తెలంగాణ ఏర్పడ్డ తరవాత రాష్ట్రంలో ఐటీరంగం అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలోని ఐటీ ఉద్యోగుల్లో 20 శాతం హైదరాబాద్‌లోనే ఉన్నారని చెప్పారు. దేశంలో ఎక్కడికైనా వెళ్లివచ్చి.. హైదరాబాద్ చూస్తే..ఇక్కడి ప్రగతి కనిపిస్తుందని అన్నారు. ఐటీ రంగంలో తెలంగాణ ప్రగతి తమకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని థ్రిల్ సిటీలో ఐటీ పరిశ్రమల ప్రతినిధుల ముఖాముఖి సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐటీ రంగంలో ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌ను అద్భుతంగా అభివృద్ధి చేశామన్నారు. కాళేశ్వరం ద్వారా మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌లను నిర్మించి హైదరాబాద్ తాగునీటి అవసరాకలు కూడా పెద్దపీట వేశామన్నారు. ఇకపోతే మహిళా పారిశ్రామికవేత్తల కోసం వీ-హబ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా సుస్థిర ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి జరుగుతుం దన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన నగరమని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఐటీ రంగంలో లక్షలాది ఉద్యోగాలు కల్పించిందని, ఉద్యోగాల కల్పనలో బెంగళూరును హైదరాబాద్ దాటిందన్నారు. ఐటీలో గత రెండేండ్లలో కొత్తగా 40 వేల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. నగరంలో ఉత్తరంవైపు ఐటీ రంగాన్ని విస్తరిస్తున్నామన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అద్భుతంగా పనిచేస్తున్నదని కితాబిచ్చారు. తొలిరెండు స్పేస్‌టెక్ స్టార్టప్‌లు హైదరాబాద్‌కు చెందినవేనని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు హైదరాబాద్ వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. తెలంగాణలో టీ ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ అందిస్తామని వెల్లడించారు. ఐటీ మంత్రిగా కేటీఆర్ ఉండటం గర్వకారణం టీ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉండటం ఐటీ ఇండస్ట్రీకి గర్వకారణమని హైసియా ప్రెసిడెంట్ మనీషా అన్నారు. హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చేందుతున్నదని వెల్లడించారు. పెట్టుబడులు పెట్టడానికి హైదరాబాద్ చాలా అనుకూలమైన ప్రాంతమని ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ అన్నారు. ఐటీ రంగంలో గత రెండేండ్లలో 40 వేల కొత్త ఉద్యోగాలు వచ్చాయన్నారు. కరోనా సమయంలో ఐటీ ఇండస్ట్రీ అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని 2014లోనే చెప్పామని, గత 8ఏళ్లుగా పరిశ్రమ అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని చెప్పారు. తొలినాళ్లలోనే ఐటీ పరిశ్రమ బలోపేతానికి అవసరమైన చర్యలను తీసుకోవడంపై దృష్టి సారించామన్నారు. అందుకే ప్రణాళిక బద్ధంగా హైదరాబాద్ లో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం, శాంతి భద్రతల బలోపేతం పాటు ఇన్నోవేషన్ ఈకో సిస్టంను మరింత అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ హబ్ టీ హబ్ ను ఏర్పాటు చేశామని మంత్రి చెప్పారు. తెలంగాణలో ప్రత్యేకంగా

మిగతా... 2లో



## 13 నుండి ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి జాతర

- సిఎం కెసిఆర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే రమేశ్

వరంగల్,జనవరి9(ప్రజామంటలు): ఈ నెల 13నుండి వరంగల్ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వర్దన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అంద జేశారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు సీఎం కేసీఆర్ కు వేద మంత్రాలతో ఆశీర్వచనం ఇచ్చారు.ముఖ్యమంత్రిని కలిసి వారిలో ఎమ్మెల్యేతో పాటు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ

మిగతా... 2లో

## మరోమారు తీవ్రమైన చలిగాలులు

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): రాష్ట్రంపై చలిపంజా విసురుతున్నది. మంచుదుప్పటి కప్పేయడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఈశాన్య గాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. రాష్ట్రంలో అత్యల్పంగా



సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 4.6 డిగ్రీల సెల్సీయస్ నమోదయింది. ఇక ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 4.7, సంగారెడ్డి జిల్లాలోని నల్లవల్లిలో 5.7, న్యాల్కల్‌లో 5.9 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా అంగడి కిష్టాపూర్‌లో 7.5 డిగ్రీలు, మెదక్ జిల్లా శివ్వంపేట, నర్సాపూర్‌లలో 8 డిగ్రీ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.మధ్యప్రదేశ్, విదర్భ ప్రాంతాల నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావం వల్ల రాబోయే రెండు రోజుల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. రెండు రోజులపాటు చలిగాలుల తీవ్రత కొనసాగుతుందని, వారం తర్వాత మళ్లీ చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. వచ్చే మూడు రోజుల వరకు గ్రేటర్‌కు ఎల్లో హెచ్చరికలు జారీచేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది.

## ప్రధాని సభను విజయవంతం చేద్దాం: బండి పిలుపు

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): రాష్ట్రంలో వచ్చే 8 నెలల్లో ఎప్పుడైనా ఎన్నికలు రావొచ్చని.. బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బండి సంజయ్ సూచించారు. బీజేపీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. బీఆర్ఎస్?లో అంతా దొంగలున్నారని విమర్శించారు. బీజేపీలో ప్రజల కోసం పని చేసే కార్యకర్తలు, నేతలున్నారని చెప్పారు. అయ్యప్ప స్వామిని కించపరిస్తే కేసీఆర్ స్పందించలేదని బండి సంజయ్ ఆరోపించారు. భాగ్యలక్ష్మి అమ్మవారు, సరస్వతి దేవిని కించపరిచినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు.ఎవరైన హిందూ ధర్మాన్ని కించపరిస్తే ఉరుకోమని హెచ్చరించారు.



దీనికి పార్టీ పర్మిషన్ అవసరం లేదని చెప్పారు. ఈ నెల 19న పరేడ్ గ్రౌండ్ లో జరిగే మోడీ సభను విజయవంతం చేయాలని సంజయ్ పిలుపునిచ్చారు.

## 65 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ

- రాష్ట్రంలో రైతులకు పెట్టుబడిసాయంగా రూ.65 వేల కోట్లు జమ
- జీతాలు ఆపి మరీ పెట్టుబడి సాయం: హరీష్ రావు



మెదక్,జనవరి9(ప్రజామంటలు): రాష్ట్రంలో రైతులకు ఉచిత కరెంటు, పెట్టుబడి సాయంగా రైతుబంధు అందిస్తున్నామని మంత్రి హరీశ్ రావు అన్నారు. పెట్టుబడిసాయంగా రూ.65 వేల కోట్లు రైతుల ఖాతాలో జమచేసిన రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని చెప్పారు. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. తూప్రాన్ డివిజన్ కేంద్రంలోని నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనాన్ని సోమవారం మంత్రి హరీష్ రావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ రైతులకు

మిగతా... 2లో

## మాస్టర్ ప్లాన్‌పై హైకోర్టులో రైతుల పిటిషన్

- కామారెడ్డిపై హైకోర్టు విచారణకు స్వీకరణ

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రద్దు, జిల్లాలో తాజా పరిణామాలపై రైతులు హైకోర్టును ఆశ్రయించారు. రైతుల పిటిషన్ విచారణను న్యాయస్థానం కూడా స్వీకరించింది. ఈ నేపథ్యంలో ముందస్తు సమాచారం ఇవ్వకుండానే అధికారులు భూములను కొత్త మాస్టర్ ప్లాన్ జాబితాలో పెట్టారని పిటిషనర్లు వాదించారు. కొత్త మాస్టర్ ప్లాన్ కు నిరసనగా రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని రైతులు పిటీషన్ లో పేర్కొనగా... తమను సంప్రదించకుండా భూములను రీ క్రియేషనల్ జోన్ గా ప్రకటించారని ఆరోపించారు. కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ చూస్తే కేవలం తమను ఇబ్బంది పెట్టేందుకే అన్నట్టుగా ఉందని ఈ సందర్భంగా రైతులు వాపోయారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మాస్టర్ ప్లాన్ ను రద్దు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ లో పేర్కొన్నారు. అయితే మాస్టర్ ప్లాన్ కేవలం ముసాయిదా మాత్రమే అని కలెక్టర్ వివరణ ఇచ్చారు. కానీ రైతులు దీనిని నమ్మడం లేదు. కాగా రైతులపై జరిగిన దాడుల అంశాలను సైతం రైతుల

మిగతా... 2లో





## ప్రమాదకరంగా 603 భవనాలు

### జోషీమఠ్‌ను వీడిన గ్రామస్థులు

### ఇళ్లను వీడడంతో కన్నీటి పర్యంతం

డెహ్రాడూన్,జనవరి9(ప్రజామంటలు): ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్‌లో భూమి కుచించుకుపోతున్నది. దాదాపు 603 భవనాలు బీటలు వారాయి. ప్రమాదకరంగా ఉన్న భవనాలకు అధికారులు సీల్ వేశారు. ఎస్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో సుయి గ్రామాన్ని ఖాళీ చేయించగా..

మిగతా... 2లో



## కొచ్చర్ దంపతులకు హైకోర్టులో ఊరట

- సిబిఐ అరెస్టులు సక్రమంగా లేవని వ్యాఖ్య
- బెయిల్మంజూరుచేస్తూ ఆదేశాలు జారీ

ముంబై,జనవరి9(ప్రజామంటలు): ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌ల అరెస్టులు చట్టానికి అనుగుణంగా జరగలేదని బోంబే హైకోర్టు సోమవారం తెలిపింది. వీరిద్దరికి బెయిలు మంజూరు చేసింది. దీంతో వీరిద్దరూ జ్యుడిషియల్ కస్టడీ నుంచి విడుదల కాబోతున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ లోన్ ఫ్రాడ్ కేసులో వీరిని సీబీఐ

మిగతా... 2లో




## ఉగ్రవాదిగా అర్ష్‌దల్లా గుర్తింపు

- కఠినచర్యలకు ఉపక్రమించిన హోంమంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ,జనవరి9(ప్రజామంటలు): ఐఎస్ఐ మద్దతు ఉన్న ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్‌కు చెందిన అర్ష్‌దీప్ సింగ్ గిల్ అలియాస్ అర్ష్ దల్లాపై హోం మంత్రిత్వ శాఖ కఠిన



చర్యలు చేపట్టింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణచట్టం కింద అర్ష్ దల్లాను ఉగ్రవాదిగా హోం మంత్రిత్వశాఖ సోమవారం ప్రకటించింది. ఐఎస్ఐ ఆదేశాల మేరకు అర్ష్‌దీప్ దల్లా టెర్రర్ మాడ్యూల్‌ను నడుపుతున్నాడు. దల్లా కేటీఎఫ్ కెనడాకు చెందిన చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్‌కు సన్నిహితుడు. అర్ష్‌దల్లా పంజాబ్‌తో పాటు విదేశీల్లో పలు నేరాలకు పాల్పడ్డాడు. పంజాబ్‌లో జరిగిన పలు హత్యల్లోనూ ప్రమేయం ఉన్నట్లు తేలింది. పాక్ నుంచి ఆర్డీఎక్స్, ఐఈడీ, ఏకే-47, ఇతర ఆయుధాలు, మందుగుండు సామగ్రి సరఫరాకు సంబంధించిన కేసుల్లోనూ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం అతన్ని కెనడా నుంచి రప్పించే ప్రయత్నాలు జరుగుతుండగా.. త్వరలోనే భారత్‌కు తీసుకురానున్నారు. గతేడాది మేలో రెడ్‌కార్నర్ నోటీసు జారీ అయ్యింది. ఇదిలా ఉండగా.. హోంశాఖ మంత్రి అమిత్‌షా జమ్మూకశ్మీర్ నేతలతో ఇవాళ రాత్రి 9 గంటలకు

మిగతా... 2లో

## ఖమ్మంలో రాజుకున్న ఎన్నికల వేడి

- బిఆర్ఎస్ ఆవిర్భావ సభకు భారీగా ఏర్పాట్లు
- పార్టీ ముఖ్యనేతలతో సిఎం కెసిఆర్ సమాలోచనలు
- పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావుల ప్రకటనలతో అలర్ట్
- ఖమ్మం సభతో సత్తాచాటాలని చూస్తున్న బిఆర్ఎస్

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఖమ్మం జిల్లాలో ఎన్నికల వేడి రాజు కుంటోంది. తెలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న ఖమ్మంపై సీఎం కేసీఆర్ మళ్లీ గురిపెట్టారు. అందుకే వ్యూహాత్మకంగా ఈనెల 18న ఖమ్మంలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభ జరపాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఖమ్మంజిల్లా రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాపై దృష్టిసారించారు. జిల్లాలో ఇటీవల ఆత్మీయ సమావేశాలు, సభలు జోరందుకోవడం, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారంటూ వార్తలు రావడం, వచ్చే ఎన్నికల్లో తన అనుచరులు పది నియోజకవర్గాల్లో పోటీలో ఉంటారని ప్రకటన చేయడంతో బీఆర్ఎస్



నాయకత్వం అందుకు తగినట్టుగా వ్యూహరచన చేస్తోంది.గత ఎన్నికల పరిణామాలను దృష్టిలో ఉంచుకునే సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లా రాజకీయంపై కార్యాచరణలోకి దిగారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. మంత్రి పువ్వాడ

మిగతా... 2లో

## 13 నుండి ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి జాతర

మొదటి పేజీ తరువాయి..
ఈవో నాగేశ్వర రావు, ఆలయ మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్య, ప్రధాన అర్చకులు రవీందర్, విక్రాంత్ జోషి, మధుకర్ శర్మ,పురుషోత్తమ శర్మ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన హనుమకొండ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13 నుండి ఉగాది వరకు ఇక్కడ వైభవంగా జరిగే ఉత్సవాలు జరగనున్నాయి. భోగి, మకర సంక్రాంతి బండ్లు తిరుగుట, రేణుకా ఎల్లమ్మ పండగ, శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉగాదితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టారు.

## పోలీస్ అభ్యర్థులకు న్యాయంచేసే వరకు పోరు

మొదటి పేజీ తరువాయి..
పాల్గొన్న రేవంత్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీహార్ అధికారులకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఎందరో ప్రాణాలు అర్పించి సాధించుకున్న రాష్ట్రంలో బీహార్ అధికారుల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడి యువతకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎస్ సోమేశ్ కుమార్, అరవింద్ కుమార్, రజత్ కుమార్, సందీప్ సుల్తానియా, కొత్తగా వచ్చిన డీజీపీ అంజనీ కుమార్ కూడా బిహార్ వాళ్లేనని చెప్పారు. పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ఛైర్మన్ కూడా వేరే రాష్ట్రానికి చెందిన అధికారేనని తెలిపారు. తెలంగాణ ప్రాంతం వాళ్లు ఉంటే ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల గోస వినేవారని ..కానీ ఉన్నత పదవుల్లో మెజార్టీ అధికారులు బిహార్ కు చెందిన వారే కావంతో ఇక్కడ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు.కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు పదవులు..తెలంగాణ కోసం పోరాటం చేసిన నిరుద్యోగులకు ఇన్ని గోసలా అని సీఎం కేసీఆర్ ను ప్రశ్నించారు రేవంత్ రెడ్డి.

## ఉగ్రవాదిగా అర్షదల్లా గుర్తింపు

మొదటి పేజీ తరువాయి..
ఢిల్లీలోని తన నివాసంలో భేటీకానున్నట్లు సమాచారం. ఈ భేటీలో రాజకీయ, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరో వైపు గత శనివారం హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ ఆసిఫ్ మక్బూల్ దార్‌ను కేంద్రం ఉగ్రవాదిగా ప్రకటించింది. 7న కేంద్రం పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్‌తో పాటు దాని సమూహాలన్నింటిని ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. అలాగే టీఆర్ఎఫ్‌పై సైతం నిషేధం విధించింది. టీఆర్ఎఫ్ కమాండర్ షేక్ సజ్జాద్ గుల్, లష్కర్ కమాండర్ మహ్మద్ అమీన్ అలియాస్ అబు ఖుబైబ్‌ను ఉగ్రవాదిగా గుర్తిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.

## 65 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ

మొదటి పేజీ తరువాయి..
రాష్ట్రంలో ఉచిత కరెంటు సరఫర చేస్తున్నమాని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు అందిస్తున్నామని, రైతు బంధు ద్వారా 65 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేసిన రైతు బాంధవుడు సిఎం కెసిఆర్ అని ఆయన పేర్కొన్నారు. రైతు చనిపోతే రైతు బీమా ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇచ్చి రైతు కుటుంబాన్ని ఆదుకుంటున్నామని తెలిపారు. 98 వేల మంది రైతుల కుటుంబాలకు రైతు భీమా ద్వారా ఐదు లక్షలు ఇచ్చామని, ఎండాకాలంలో కూడా హల్దీ వాగు చెక్ డ్యామ్ ల పై నుండి మత్తడి దూకుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశీస్సులతో తూప్రాన్ లో మూడు మార్కెట్లు వచ్చాయని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేలుగా మంత్రులుగా ఉన్న వారు ఒక్క మార్కెట్ కూడా ఇవ్వలేదని, కరోనా కష్టకాలంలో కూడా ఉద్యోగుల, ఎమ్మెల్యేల, జీతాలు ఆపి రైతులకు రైతుబంధు వేశామని తెలిపారు. రైతు చనిపోతే రైతు బీమా ద్వారా రూ.5 లక్షలు ఇచ్చి కుటుంబాన్ని ఆదుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు 98 వేల మంది రైతుల కుటుంబాలకు రైతు బీమా అందిచామని వెల్లడించారు. కరోనా కష్టకాలంలో కూడా ఉద్యోగులు, ఎమ్మెల్యేల జీతాలు ఆపి రైతులకు రైతుబంధు జమచేశామన్నారు. ఎండాకాలంలో కూడా హల్దీ వాగు చెక్‌డ్యామ్‌లపై నుంచి మత్తడి దూకుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో తూప్రాన్‌లో మూడు మార్కెట్లు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఉన్నవారు ఒక్క మార్కెట్ కూడా ఇవ్వలేదని విమర్శించారు.

## కేజ్రీవాల్ ఇంటిముందు బిజెపి ఆందోళన

### అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ,జనవరి9(ప్రజామంటలు):** ఢిల్లీ మేయర్ ఎన్నికలో ఈనెల 6న జరిగిన హింసకు వ్యతిరేకంగా.. బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. సీఎం కేజ్రీవాల్ ఇంటి ఎదుట నిరసన చేపట్టి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. మేయర్ ఎన్నికల్లో ఘర్షణకు కారణమైన కౌన్సిలర్లను సస్పెండ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. అలాగే.. ఇంతకు ముందెన్నడూ మహిళా కౌన్సిలర్లపై దాడులు జరగలేదని ఆరోపించింది. దీంతో నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలపై పోలీసులు వాటర్ కెనాన్ ప్రయోగించారు. బీజేపీ నిరసనకు వ్యతిరేకంగా ఆప్ కార్యకర్తలు కూడా ఆందోళనకు దిగారు. మేయర్ ఎన్నికలో బీజేపీ రిగ్గింగ్ చేసిందని ఆరోపించారు.



మరోవైపు మున్సిపల్ కౌన్సిలర్లను సస్పెండ్ చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని బీజేపీ హెచ్చరించింది. కొత్త మేయర్‌ను ఎన్నుకునే సమావేశంలో ఇటీవల భారీ ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే.. మేయర్ ఎన్నికలకు ముందు ఎమ్ సీడీ ఛాంబర్‌లో బీజేపీ, ఆఫ్ కౌన్సిలర్ల మధ్య ఘర్షణ జరిగింది. నామినేటెడ్ కౌన్సిలర్ల ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా గందరగోళం నెలకొంది. ఎన్నికైన కౌన్సిలర్లను కాకుండా ముందుగా నామినేటెడ్ కౌన్సిలర్లను ప్రమాణ స్వీకారం చేయాలని పిలవడంతో ఆప్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ కారణంగా మేయర్ ఎన్నిక కోసం జరగాల్సిన ఓటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై స్పందించిన బీజేపీ ఆప్ భయపడుతోందని.. ఆ పార్టీ నైతికంగా ఓడిపోయిందని వ్యాఖ్యలు చేసింది. దీంతో ఆప్ కౌన్సిలర్లు కూడా బీజేపీ పై విమర్శలు చేశారు. ఇది కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది. దీనిపై మరోసారి బీజేపీ కార్యకర్తలు నిరసన చేస్తున్నారు.

# కొచ్చర్ దంపతులకు హైకోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి..
డిసెంబరు 23న వీరిద్దరినీ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తమ అరెస్ట్ చట్టవిరుద్ధమని, అవినీతి నిరోధక చట్టం ప్రకారం అవసరమైన అనుమతులను పొందకుండా తమను అరెస్ట్ చేశారని వారు ఆరోపించారు. చందా కొచ్చర్ తరపున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, అర్థం లేని దర్యాప్తు చేసి ఆమెను అరెస్ట్ చేశారన్నారు. మహిళలను అరెస్ట్ చేసేటపుడు మహిళా అధికారి ఉండాలని చట్టం చెప్తోందని, చందా కొచ్చర్‌ను అరెస్ట్ చేసేటపుడు ఈ నిబంధనలను తుంగలో తొక్కారని తెలిపారు. దీపక్ కొచ్చర్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, చందా, దీపక్‌లు సీబీఐ నోటీసులకు సంపూర్ణంగా సహకరించారని, వారిని అరెస్ట్ చేసి ఉండకూడదని అన్నారు.దీనిపై సీబీఐ న్యాయవాదులు స్పందిస్తూ, కొచ్చర్ దంపతుల అరెస్ట్ విషయంలో చట్ట నిబంధనలను ఉల్లంఘించలేదని తెలిపారు. సమన్లు జారీ చేసినపుడు దర్యాప్తునకు వీరు హాజరయ్యారని, అయితే తమ ప్రశ్నలకు తప్పించుకునే సమాధానాలు చెప్పడం 'సహకరించడం' కాదని పేర్కొన్నారు. ఆమెను అరెస్ట్ చేసే సమయంలో మహిళా అధికారి లేరనే ఆరోపణను తోసిపుచ్చారు. వైట్ కాలర్ నేరాల్లో నిందితులను తాకవలసిన అవసరం ఉండదని, అరెస్ట్ గురించి మౌఖికంగానే చెబుతామని తెలిపారు. చందా కొచ్చర్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆమెకు మౌఖికంగా సమాచారం ఇచ్చామని, మహిళా కానిస్టేబుల్ ఆమెను తనిఖీ చేశారని తెలిపారు. జనవరి 15న తమ కుమారుని వివాహానికి హాజరయ్యేందుకు తమకు బెయిలు మంజూరు చేయాలని కొచ్చర్ దంపతులు అంతకుముందు వేర్వేరుగా దరఖాస్తు చేశారు. ఈ పిటిషన్లను పరిగణనలోకి తీసుకోబోమని బోంబే హైకోర్టు గత వారం తెలిపింది. కొచ్చర్ దంపతుల అరెస్టులు చట్టానికి అనుగుణంగా జరగలేదని, అందువల్ల వారిని విడుదల చేయాలని ఆదేశించింది. చెరొక రూ.1 లక్ష నగదు పూచీకత్తు, అంతే విలువ గల ఒకరు లేదా అంతకన్నా ఎక్కువ మంది జామీనుదారుల హామీపై వారిని విడుదల చేయాలని ఆదేశించింది. పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారులకు అప్పగించాలని ఈ దంపతులకు తెలిపింది. జస్టిస్ రేవతి మోహితే డెరే, జస్టిస్ పీకే చవన్ డివిజన్ బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది.
సీబీఐ ఆరోపణల ప్రకారం, ఐసీఐసీఐ బ్యాంకుకు చందా కొచ్చర్ సీఈఓగా పని చేసిన కాలంలో వీడియోకాన్ కంపెనీకి ఆ బ్యాంకు రూ.3,250 కోట్లు రుణం ఇచ్చింది. ఇది నిర్ణీత నిబంధనలకు విరుద్ధం. కొచ్చర్ దంపతులు, వీడియోకాన్ గ్రూప్ చైర్మన్ వేణుగోపాల్ ధూత్, సుప్రీం ఎనర్జీ, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఈ కేసులో నిందితులు.

## మాస్టర్ ప్లాన్‌పై హైకోర్టులో రైతుల పిటిషన్

మొదటి పేజీ తరువాయి..
తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలపనున్నట్టు సమాచారం. కామారెడ్డి మున్సిపాలిటీ కొత్త మాస్టర్ ప్లాన్ ప్రపోజల్స్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి టౌన్, విలీన గ్రామాలు అడ్లూర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, టెకిర్యాల్, ఇల్చిపూర్, దేవునిపల్లి, లింగాపూర్, సరంపల్లి, పాతరాజంపేట, రామేశ్వర్‌పల్లి కలుపుకొని 61.5 చదరపు కిలోమీటర్ల పరిధికి సంబంధించి ఢిల్లీకి చెందిన ఒక కన్‌స్టలెన్సీ కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించింది.

దీంతో డ్రాఫ్టిరిలీజ్ చేసిన అధికారులు 2023 జనవరి 11 వరకు అభ్యంతరాలు చెప్పుకునేందుకు అవకాశం ఇచ్చారు. కొత్త మాస్టర్ ప్లాన్ లోఇక్కడ 8.5 శాతం ఏరియా 1,200 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ కింద ప్రతిపాదించారు. ఇందులో దాదాపు 900 ఎకరాలు నేషనల్‌హైవే పక్కన..టౌన్ కు దగ్గరగా ఉన్న భూములే ఉన్నాయి. ఇందులో ఎక్కువగా పచ్చని పంటలు పండే అడ్లూర్ ఇల్చిపూర్, టెకిర్యాల్, అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామాలకు చెందిన భూములు ఉండడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. ఇండస్ట్రియల్ జోన్‌లో ఇండ్ల నిర్మాణానికి పర్మిషన్ రాదని, నిర్మాణాలకు బ్యాంకులు లోన్లు కూడా ఇవ్వవని, ఫలితంగా భూముల విలువ తగ్గుతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరినీ సంప్రదించకుండా.. తమకు చెప్పకుండా కొత్త మాస్టర్ ప్లాన్ ఎలా తయారు చేస్తారంటూ రైతులు నిలదీస్తున్నారు. 100 ఫీట్ల రోడ్డు ప్రతిపాదన మీదా రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.



## ఐటి ఉద్యోగులకు అందుబాటులోకి మినీ బస్సులు

### జెండా ఊపి ప్రారంభించిన బాజిరెడ్డి

**హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు):** ఐటీ ఉద్యోగులకు ప్రయాణం సులభతరం చేసేందుకు టీఎస్ఆర్టీసీ ముందుకు వచ్చింది. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి ఇబ్బందులు పడుతున్న ఎంప్లాయిస్‌కు మరింత వెసులుబాటు ఉండే విధంగా నిర్ణయం తీసుకుంది. మాదాపూర్ సైబర్ టవర్స్ వద్ద సైబర్ లైనర్ పేరుతో వైఫై తో కూడిన పది టీఎస్ ఆర్టీసీ మినీ ఏసీ బస్సులను టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్,ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ,కార్పొరేటర్లు,ఆర్టీసీ అధికారులు హాజరయ్యారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుండి వేవ్ రాక్, జీఏఆర్, డిఎల్ ఎఫ్ ల వరకు సైబర్ లైనర్ బస్ సర్వీసులు నడవనున్నాయి.ఐటీ కంపెనీలకు శనివారం,ఆదివారం సెలవు సందర్భంగా సోమవారం నుండి శుక్రవారం వరకు ఈ సర్వీసులు నడుస్తాయని అధికారులు తెలిపారు.

# ఖమ్మంలో రాజుకున్న ఎన్నికల వేడి

మొదటి పేజీ తరువాయి..
అజయ్‌కుమార్, ఎంపీలు నామానాగేశ్వర్‌రావు, రవిచంద్ర, పార్థసారథి, ఎమ్మెల్యేలు హరిప్రియ, సండ్ర వెంకటవీరయ్య, రాములు నాయక్, ఎమ్మెల్సీ మధు, జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ భేటీలో పాల్గొన్నారు. ఈ నెల 18న ఖమ్మంలో భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భావ బహిరంగ సభ జరుగనున్నది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సభ ఏర్పాట్లపై ఖమ్మం జిల్లా నేతలతో సీఎం చర్చించారు. పార్టీ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా



నిర్వహిస్తున్న సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్‌మాన్, కేరళ సీఎం పినరాయి విజయన్, యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో పాటు పలువురు కీలక నేతలు హాజరయ్యే అవకాశం ఉన్నది. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం కోరిన సీఎం కేసీఆర్, ఈ సభ ద్వారా దేశ రైతాంగానికి, రాజకీయ పక్షాలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని భావిస్తున్నట్లుగా తెలుస్తున్నది. బీఆర్ఎస్ ద్వారా దేశ వ్యవసాయరంగంలో తీసుకొచ్చే మార్పులపై ఈ సభ ద్వారా వివరించనున్నట్లు సమాచారం. ఇకపోతే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో పదిసీట్లలో కేవలం ఖమ్మం అసెంబ్లీ సీటు మాత్రమే టీఆర్ఎస్ గెలుచుకుంది. మిగిలిన తొమ్మిది చోట్ల పార్టీలోని అంతర్గత వర్గ విభేధాలతో అభ్యర్థులు ఓటమి చెందారు. ఖమ్మం జిల్లాలో మెజారిటీ స్థానాలను టీఆర్ఎస్ గెలుచుకుంటోందని కేసీఆర్ భావించినా.. ఫలితాలు విరుద్ధంగా రావడంతో లోక్‌సభ ఎన్నికల సందర్భంలో ఖమ్మం జిల్లాకు తానే ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకుంటానని చెప్పి కేసీఆర్ సర్వం చూసుకున్నారు. ప్రస్తుత రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డిని కేసీఆర్ తరపున ఇన్‌చార్జ్‌గా పంపి ఖమ్మంలో నామ నాగేశ్వరరావు భారీ మెజారిటీతో గెలుపొందేలా వ్యూహరచన చేశారు. గత ఎన్నికల్లో పొంగులేటి టీఆర్ఎస్ అభ్యర్థుల ఓటమికి తెరవెనుక ప్రయత్నాలు చేశారని, వైరా నియోజక వర్గంలో కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థి మదన్‌లాల్‌కు వ్యతిరేకంగా రాములునాయక్‌ను స్వతంత్రంగా బరిలోకి దించి ఆయన్ను గెలిపించడంలో శ్రీనివాసరెడ్డి తెరవెనుక పాత్ర పోషించారన్న ప్రచారం ఉంది. ఆ తర్వాత రాములునాయక్‌ను తీసుకెళ్లి కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేర్పించారు. అయితే పొంగులేటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు గుర్తించిన కేసీఆర్ ఆయనకు లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదన్న చర్చ జరిగింది. చివరకు టీడీపీలో ఉన్న నామ నాగేశ్వరరావును పార్టీలో చేర్చుకుని టీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో ఆయన గెలుపొందడం, ఆ వెంటనే లోక్‌సభా పక్షనేతగా ఎన్నికకావడం చకచకా జరిగాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ మళ్లీ ఖమ్మం జిల్లా రాజకీయాన్ని తన కనుసన్నల్లో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితిని గమనించి ఈసారి కూడా టికెట్ రాదని భావించి మాజీ ఎంపీ పొంగులేటి తన అనుచరులతో బీజేపీలోకి చేరేందుకు రంగం సిద్ధంచేసుకోవడంతో జిల్లాలో పార్టీ నష్టపోకుండా ఉండేందుకు ముందుచూపుతో బీఆర్ఎస్ ఆవిర్భావ సభను ఖమ్మంలో నిర్వహించాలని నిర్ణయించారు. మొత్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో అధికార పార్టీ నేతలు చేస్తున్న కామెంట్లు హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. నేతలు పార్టీ నాయకత్వంపై ఉన్న అసంతృప్తిని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బయట పెడుతున్నారు. గత కొన్ని రోజులుగా జిల్లాలోని నేతల మాటలు, వారు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు చర్చనీయాంశాలుగా మారాయి. రానున్న రోజుల్లో జిల్లాలో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయన్నది ప్రస్తుతం మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. ఈ నెల 18న ఖమ్మంలో బీఆర్ఎస్ భారీ సభ నిర్వహించేందుకు సమాయత్తమైంది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతో సీఎం కేసీఆర్ ప్రగతి భవన్ లో భేటీ అయ్యారు. అయితే ఈ సమావేశానికి కొత్తగూడెం, పాలేరు ఎమ్మెల్యే లు వనమా వెంకటేశ్వర రావు, కందా ఉపేందర్ రెడ్డి డుమ్మా కొట్టారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఈ మీటింగ్ కు హాజరుకాలేదు. ఈ క్రమంలో పార్టీలో ఉండేదేవరు? పోయేదేవరన్న అంశంపై జిల్లా రాజకీయాల్లో జోరుగా చర్చ సాగుతోంది. గత కొంత కాలంగా పార్టీపై తుమ్మల,పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పొంగులేటి గత కొన్నిరోజులుగా చేస్తున్న కామెంట్స్ చూస్తే ఆయన పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్టు అర్థమవుతోంది. అటు తుమ్మల కూడా తాను పాలేరు నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం సిట్టింగ్ లకే టికెట్లు ఇస్తామని ప్రకటించారు. ఆ క్రమంలో తుమ్మల కూడా పార్టీ మారుతారన్న ప్రచారం జోరందుకుంది. వారిద్దరూ బీజేపీలో చేరనున్నారన్న ఊహాగానాలు సైతం వినిపిస్తున్నాయి. అయితే ఖమ్మం జిల్లా రాజకీయ చిత్రం ఎలా మారనుందన్న అంశంపై క్లారిటీ రావాలంటే ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ సభ వరకు వేచి చూడాల్సిందే.

## కంటెంట్ ఉంటే హిట్ కాక తప్పదు

### దర్శకుడు దశరథ్ పుస్తకావిష్కరణలో కెటిఆర్

**హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు):** కంటెంట్ ఉన్న సినిమా హిట్ అయినప్పుడు కంటెంట్ ఉన్న రాజకీయ నాయకుడు హిట్ అవుతాడని




మంత్రి కేటీఆర్ అన్నారు. భారత అంతర్జాతీయ సినిమాకు హైదరాబాద్ వేదికగా మారాలని ఆయన చెప్పారు. ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కథా రచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని దర్శకుడు దశరథ్ రాశారు. కంటెంట్ ఉన్న సినిమా పాన్ ఇండియా అయినప్పుడు.. కంటెంట్ ఉన్న వ్యక్తి పాన్ ఇండియాకు వెళ్లలేదాని కేటీఆర్ చెప్పారు. దశరత్ రాసిన కథా రచన పుస్తకాన్ని భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించడం అభినందనీయమన్నారు. సృజనాత్మక కంటెంట్ అంటే తనకు చాలా ఇష్టమని మంత్రి కేటీఆర్ అన్నారు. పుస్తకాంటే తనకు చాలా ఇష్టమని అమెరికాలో ఉప్పుప్పుడు కూడా పుస్తకాలు చదివేవాడినని చెప్పారు. రోజుకు 12 దినపత్రికలు చదివేవాణ్ని అని తెలిపారు. సినీ పరిశ్రమలో అజ్ఞాత సూరీలు ఎంతో మంది ఉంటారని.. ప్రతి ఒక్కరూ ఒక కథ చెబుతుంటారన్నారు. కరోనా సమయంలో సీఎం కేసీఆర్ ప్రెస్ మీట్ కోసం ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురుచూసేవారని చెప్పారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడం కేసీఆర్ లక్షణమన్నారు. వక్తలు మాట్లాడటం వెనుక ఎంతో విషయ పరిజ్ఞానం ఉంటుందని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు.

# ఐటీ ఉద్యోగాల్లో బెంగళూరును దాటాం

మొదటి పేజీ తరువాయి..
శానిటేషన్ హబ్ కూడా ఏర్పాటు చేశామన్న ఆయన.. త్వరలో దేశంలోనే అతిపెద్ద ప్రోటో టైప్ సెంటర్ టీ వర్క్స్ ను ప్రారంభం చేయనున్నామని చెప్పారు. దేశానికి గర్వకారణమైన అంతరిక్ష పరిశోధనలలో పనిచేస్తున్న స్కై రూట్, ధ్రువ వంటి స్టార్ట్ అప్‌లు హైదరాబాద్ నుంచే ప్రారంభమయ్యాయమని, అవి విజయవంతంగా వృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని మంత్రి కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్ లో ప్రస్తుతం ఇన్నోవేషన్ సిస్టం బలంగా ఉందని, త్వరలో మరిన్ని స్టార్ట్ అప్స్ విజయం సాధిస్తాయన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశంలో ఐటీ రంగంలో వచ్చిన ఉద్యోగాల సంఖ్య విషయానికొస్తే మొదటిసారి బెంగళూరు నగరాన్ని హైదరాబాద్ దాటిందని గొప్పగా చెప్పారు. హైదరాబాద్ సాధించిన ఈ ఘనత తనకు అత్యంత సంతోషాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఆఫీస్ స్పేస్ వినియోగం విషయంలో బెంగళూరుని అనేక పర్యాయాలు హైదరాబాద్ దాటినా, అత్యధికంగా ఉద్యోగాలు కల్పించిన నగరంగా నిలవడం గర్వకారణమన్నారు. 8 సంవత్సరాల కింద తాము ప్రారంభించిన టాస్క్ ద్వారా 7 లక్షల మందికి పైగా యువకులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించామన్న ఆయన... ఈ శిక్షణ కేవలం ఐటీ రంగంలోనే కాకుండా లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ వంటి అనేక రంగాల్లోనూ కొనసాగిందని తెలిపారు. ÷ాష్ట్రంలోని పదిలక్షల గృహాలకు ఇంటర్నెట్ ని అందించే టీ-÷బైర్ ఈ సంవత్సరం పూర్తవుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో ఉన్న 3వేలకు పైగా వైఫ÷, హాట్ స్పాట్ ల ద్వారా అందిస్తున్న వైఫ÷ విజయవంతం అయిందని చెప్పారు. సమాజహితం కోసం పనికిరాని సాంకేతిక పరిజ్ఞానం వృథా అనే తమ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆలోచన మేరకు పనిచేస్తున్నామన్నారు. పౌరులకు సేవలందించే విషయంలో దేశంలోనే తెలంగాణ మీ-సేవా అత్యుత్తమమైనదిగా ఉందని చెప్పవచ్చన్నారు. పెన్షన్లు, డ్రైవింగ్ లైసెన్స్ ల రెన్యువల్, ఈ -ఓటింగ్ వంటి అనేక ప్రభుత్వ సేవలలో పెద్ద ఎత్తున నూతన టెక్నాలజీలను ఉపయోగించుకుంటున్న ప్రభుత్వం తమదని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల తో పాటు సోషల్ ఇన్ఫ్రా కూడా బాగా బలోపేతం అయిందన్న మంత్రి.. గత 8 సంవత్సరాలుగా ఒక నగరంలో అత్యధికంగా మౌలిక వసతులు కల్పించిన నగరంగా హైదరాబాద్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంటుందని చెప్పవచ్చున్నారు. ఇప్పటికే ఎస్ఆర్డీపీ ద్వారా అనేక ప్రాజెక్టులను పూర్తి చేశామని, త్వరలోనే హైదరాబాద్ నగరంలో సంపూర్ణ మురుగునీటి శుద్ధి వంద శాతం జరుగుతుందని, ఇంతటి ఘనత దేశంలో ఏ నగరానికి లేదని స్పష్టం చేశారు. 2050 వరకు హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు సరిపడా మౌలిక వసతులను నిర్మాణం చేస్తున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోతో పాటు ఎయిర్ పోర్టు మెట్రో వంటి మరిన్ని ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ ఐటీ పరిశ్రమను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని చెప్పారు. హైదరాబాద్ లోని ఇతర ప్రాంతాలతోపాటు, తెలంగాణలోని ఇతర నగరాలకు కూడా ఐటీ పరిశ్రమ తీసుకుపోయే విషయంలో ఐటీ సంస్థలు ఆలోచన చేయాలని కోరారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో ఐటీ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన చేసిందన్న ఆయన.. పలు జిల్లా కేంద్రాల్లో ఇప్పటికే ఐటీ టవర్లను కూడా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. అదిలాబాద్ లాంటి మారుమూల ప్రాంతాల్లోనూ ఐటీ కార్యాలయాలు అందుబాటులోకి వస్తున్నాయని, వరంగల్ లో ఇప్పటికే పలు కంపెనీలు విజయవంతంగా తమ కార్యకలా పాలను కొనసాగిస్తున్నాయన్నారు. భవిష్యత్తులో భారత




దేశంలో మరిన్ని ఐటీ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎమర్జింగ్ టెక్నాలజీల ద్వారా వచ్చే ఉద్యోగాల విషయంలో కంపెనీలు ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలని చెప్పారు. తెలంగాణలోని బాసర ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థ, అక్కడున్న విద్యార్థులతో ఐటీ కంపెనీలు పని చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో ఎక్కడ అభివృద్ధి చేయాలో తమకు తెలుసని, ఐటీ పరిశ్రమ ఉన్న ప్రాంతంలో మాత్రమే అభివృద్ధి చేస్తున్నామన్నమాట సరికాదని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకనుగుణంగానే అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో 300 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసే ప్రయత్నం జీహెచ్ఎంసీ చేస్తోందన్నారు.

## ప్రమాదకరంగా 603 భవనాలు

(మొదటి పేజీ తరువాయి)
జనమంతా కన్నీటితో తమ ఇండ్లను వీడి వెళ్తున్నారు. బాధితులనంతా మనోహర్‌భాగ్‌కు తరలించారు. బాధితులు తమ వస్తువులతో తరలివెళ్లారు. ఇండ్లను ఖాళీ చేస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఫొటోలు అందరినీ భావోద్వేగానికి గురి చేస్తున్నాయి. కళ్లల్లో నీళ్లు తిరుగుతూ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. వెళ్లేందుకు ఇష్టం లేకపోయినా.. విధిలేని పరిస్థితుల్లో గ్రామం నుంచి వీడుతున్నారు. సీఎం ధామి ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి మీనాక్షి సుందరం జోషిమఠ్‌లోని భవనాలు, అక్కడ నివసిస్తున్న వారి వివరాలు సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

ఇదిలా ఉండగా.. జల్‌శక్తి మంత్రిత్వశాఖకు చెందిన హైపవర్ కమిటీ జోషిమఠ్‌కు చేరింది. శనివారం జోషిమఠ్‌లో అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ.. భవనాలకు చాలా పగుళ్లు వచ్చాయని, ఆయా భవనాలను వీలైనంత త్వరగా కూల్చివేయాలని ప్రభుత్వానికి సూచించింది. జోషిమఠ్‌లో 603 భవనాలు బీటలువారాయి. అధికారులు ఆయా భవనాలను పరిశీలించి.. 67 కుటుంబాలను తాత్కాలిక నివాసాలకు తరలించారు.

ఇదిలా ఉండగా.. చిన్నపాటి పగుళ్లు పెరిగే ప్రమాదం ఉందని, ప్రస్తుతానికి ఈ భవనాలు నివాసయోగ్యం కాదని అధికారులు పేర్కొన్నారు. అధికారుల బృందం భవనాల్లో ఉంటున్న వారి సంఖ్య వారు వృత్తి ఏంటీ? కుటుంబంలో ఉన్నది ఎంత మంది ఎక్కడ శాశ్వత పునరావాసం కోరుకుంటున్నారనే వివరాలపై ఆరా తీస్తున్నారు.

# రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన పెన్షనర్స్ నేతలు

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ను తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో కలిసినట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ లో బి.ఆర్.కె. భవన్ లో సోమేశ్



కుమార్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, పెన్షనర్స్ సమస్యలు వివరించినట్లు చెప్పారు. పెన్షనర్స్ వైద్య ఖర్చుల రీయింబర్స్ మెంట్ బిల్లులు సకాలంలో రావడం లేదని విన్నవించగా వెంటనే స్పందించి సంబంధించిన అధికారికి పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని ఆదేశించారని,గ్రంధాలయ సంస్థ ఉద్యోగులకు, పెన్షనర్స్ కు 010 కింద ట్రెజరీ ద్వారా వేతనాలు,పెన్షన్ డబ్బులు చెల్లించాలని, ప్రతి నెలా మొదటి తేదేనే పెన్షనర్స్ కు పెన్షన్ డబ్బులు అందేలా చూడాలని, తదితర సమస్యలు విన్నవించగా సానుకూలంగా స్పందించారని హరి ఆశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఈ. నవనీత రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్, గ్రంధాలయ పెన్షనర్స్ అధ్యక్షుడు కొక్కుల దేవేందర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, వివిద జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభిష్ట జన్మదినం పాఠశాల పిల్లలకు షూస్, సాక్స్ బహుకరణ

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** జనగామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల చీటూరులో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ 320ఎఫ్ ఆధ్వర్యంలో చిన్నం



సత్యనారాయణ మాధవి పుత్రిక చిరంజీవి అభిష్ట జన్మదినోత్సవం సందర్భంగా పాఠశాల పిల్లలకు షూస్, సాక్స్ బహుకరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురిజాల శంకర్ రెడ్డి అధ్యక్షతన లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు, లయన్స్ క్లబ్ జనగామ అధ్యక్షులు కుతాటి ఉప్పలయ్య, లైన్స్ క్లబ్ లైజన్ ఆఫీసర్ కృష్ణ జీవన్ బజాజ్, రీజియన్ చైర్మన్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, సెక్రటరీ చితురాల బాబు , ట్రెజరర్ సముద్రాల సందీప్, చీటూరు గ్రామ సర్పంచ్ ఐల మల్లేశం, ఎంపీటీసీ చీటూరు శ్రీమతి ఎర్ర సోమలక్ష్మి, చైర్మన్ బండారు ప్రభాకర్, మెంబర్ పసుల సోమనర్సయ్య, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కన్న పరశురాములు మాట్లాడుతూ.... ఐ క్యాంప్ డెంటల్ క్యాంప్ కూడా పాఠశాలలో నిర్వహించాలని క్లబ్ కు సూచించారు. లైన్స్ క్లబ్ అధ్యక్షులు కుతాటి ఉప్పలయ్య మాట్లాడుతూ.... విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని క్రీడల్లో రాణించాలని చదువులో సత్ఫలితాలు సాధించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.పాఠశాలలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని లైన్స్ క్లబ్ ఆఫ్ జనగామ 320ఎఫ్ ప్రతినిధులను కోరారు.

# జనగామ పోపా ఆధ్వర్యంలో పద్మశాలి క్యాలెండర్ ఆవిష్కరణ

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** జనగామ భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తరుపున రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున లింగయ్య, డిఎంహెచ్ఓ ఎక్కలదేవి మహేందర్, జనగామ జిల్లా హిమగ్రేషన్ డాక్టర్ కుడికాల భాస్కర్ డాక్టర్



ఏ.శ్రీనివాస్, పద్మశాలి జనగామ జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు ఆవిష్కరించారు ఆవిష్కరణ కార్యక్రమానికి జనగామ పోపా అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమంలో పోపా ప్రధాన కార్యదర్శి అక్కలదేవి సింహాద్రి, ఉపాధ్యక్షులు దోర్నాల కుమార్, కాముని శ్రీనివాస్ బాబు, పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్, సహాయ కార్యదర్శులు మదాసు యెల్లయ్య, నల్ల చిన్న ఆంజనేయులు, పోపా కోశాధికారి బిట్ల విజయ్ కుమార్, పోపా గౌరవ అధ్యక్షుడు గుమ్మడివెల్లి సత్యనారాయణ, మాజీ పోపా అధ్యక్షులు మచ్చ బాలనర్సయ్య, భోగ రాందయాకర్, చేరిపెల్లి శ్రీహరి, మంగళంపెల్లి జనార్దన్, దోర్నాల రమేష్, బండారు ఏక్ నాదం, కందుల సురేందర్, వడ్నాల లింగమూర్తి, నల్ల ఆంజనేయులు, కాముని వేణుగోపాల్, బిర్రు సత్యనారాయణ, బిట్ల నవీన్ బిర్రు శ్రీనివాస్ చింతకింది వేణుమాధవ్ మంచిట్ల రాజేష్ చింతకింది శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, డాక్టర్ రాంగోపాల్, కాముని లక్ష్మణ్, కాముని భారత్, మచ్చ సందీప్, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

# పండగ పూట రేషన్ బియ్యం రాలే

**రేషన్ బియ్యం వెంటనే ఇవ్వాలని కిసాన్ సాంగ్ డిమాండ్**

**జనవరి 09 (ప్రజామంటలు):** పదవ తారీకు అయినా కూడా పేదలకు రేషన్ బియ్యం రాలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 28వ తారీఖున మళ్లీ డిసెంబర్ వరకు 5 కిలోల చొప్పున ప్రతి మనిషికి ఫ్రీగా బియ్యం ఇస్తామని చెప్పడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆరు కిలోలు ఇవ్వాల్సింది రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సఖ్యత లేని మూలంగా ఈ సమస్య ఏర్పడుతుందని సంక్రాంతి పండుగ సందర్భంగా అయిన రేషన్ బియ్యం ఇవ్వాలని భారతీయ కిసాన్ సాంగ్ జిల్లా ఉపాధ్యక్షులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేయడం జరిగింది. లేకుంటే పేదలతో పెద్ద ఎత్తున తహసిల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నామన్నారు.

# నిరుద్యోగ అభ్యర్థుల వయో పరిమితి పెంచాలి

**తెలంగాణ (కాకతీయ) ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్**

**రాష్ట్ర అధ్యక్షుడు సంకె పల్లి శ్రీనివాసరెడ్డి**

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** జే యాల్ నోటిఫికేషన్ లో వయపరిమితి 52 ఎండ్లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ (కాకతీయ)ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంకె పల్లి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జనగామలో సంజయ్ నగర్ జి వై గిరి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి జూనియర్ లెక్చరర్స్ మెగా నోటిఫికేషన్ విడుదల కానందున, నిరుద్యోగుల వయసు మించి పోయిందని వారంతా కార్పొరేట్, ప్రైవేట్ కాలేజ్ లలో భోధన చేస్తూ అపారమైన అనుభవం కలిగి ఉన్నారని, ఎంసెట్ , ఐ ఐ టి , నీట్ లాంటి ప్రవేశ పరీక్షలలో కోచింగ్ ఇస్తు ప్రతిభా పాటవాలు కలిగి ఉన్నారని, వయో పరిమితి 52సంవత్స రాలకు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆశించిన నిపుణులైన అభ్యర్థులు లభిస్తారని అన్నారు. తద్వారా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యలో మంచి ఫలితాలు వస్తాయన్నారు.అలాగే ప్రభుత్వం ప్రస్తుత ఉద్యోగ పరిమితి 61 ఏండ్లకు పెంచడం వల్ల, నిరుద్యోగ అభ్యర్థుల వయోపరిమితి 52 కు పెంచవలసిన అనివార్య మైన పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వానికి సూచించారు.దీని వలన సుమారు ఒక లక్ష మంది నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. సీఎం కె. చంద్ర శేఖర్ రావు కు ఫాక్స్,ఈమెయిల్ ద్వారా వినతి పత్రాన్నిపంపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ (కాకతీయ)



ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెట్లోజు సోమేశ్వరాచారి, సహాయ కార్యదర్శి శ్రీరామోజు వెంకటరత్నం, భాస్కర్, వీణవంక రాజు, తండు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# భైరవుని చేతిలో బిచువా

**చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి**

**జనగామ జనవరి 9 (ప్రజామంటలు):** పౌరాణిక గాథల్లో కనిపించే శివుడు త్రిశూలం, ఇంద్రుడు వజ్రాయుధం , పరశు రాముడు గండ్ర గొడ్డలి , పౌరాణిక పాత్రలు ధరించినట్లే జనగామ జిల్లాలోని భైరవుడు బిచువా అనే బాకును ధరించాడని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ అన్నారు. జనగామలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయుధాలు ప్రాచీన ఇనుము ఉక్కు పరిశ్రమకు నిదర్శనం. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం మీదికొండ గ్రామంలో ఉన్న భైరవ శిల్పం నాలుగు చేతులతో ఉంది. ఇందులో ఒక చేత బిచువా అనే చిన్న కత్తి పట్టుకొని ఉంది. నిజానికి బిచువా అనేది ఒక బాకు, వంకరగా ఉండే పదునైన బ్లేడ్ . చూడటానికి గేదె కొమ్ముల ఆకారాన్ని పోలి ఉంటుంది. బిచువా అంటే హిందీలో "తేలు కుట్టడం" అని అర్థం. ఇది తేలు యొక్క కొండి (స్టింగర్) ని పోలి ఉండడం వల్ల బిచువా అని పేరు వచ్చింది. ఇది భారత ఉపఖండం నుండి ఉద్భవించింది, బాకు తేలికైనది, చిన్నగ ఉండి పట్టుకోవడానికి అనువుగా ఉంటుంది. కానీ ఘోరమైన ఆయుధం. తయారు చేయడం చాలా తేలికైనందున, బిచువా 20వ శతాబ్దం వరకు అలంకార బాకుగా కొనసాగింది. ఇతర దేవతా మూర్తుల చేతుల్లోనూ బిచువా కనిపించటం విశేషం. జనగామ జిల్లా అంతటా ఇనుమును సంగ్రహించిన ప్రాంతాలు, ఆయుధాల తయారీలో వృధాగా మిగిలిన చిట్టెం రాళ్ల గడ్డలు ఉన్నాయి. కోల్కొండ మండల కేంద్రముకు ఒక కిలోమీటర్ దూరంలో 200కు పైగా రాక్షస గుళ్ళు ఉన్నాయి. వీటికి దగ్గరలో 50 ఎకరాల దిబ్బ ఉంది. పురావస్తు శాఖ త్రవ్వకాలు జరపగా నవీన శిలాయుగం కి చెందిన " కంచు ఉలి" దొరికిందనీ చరిత్ర పుస్తకాలలో కనిపిస్తుంది.బహుశా ఇది తామ్ర శిలా యుగానికి



చెందినదై ఉంటుంది. అప్పటి నుండి జనగామ జిల్ల అంతటా ఆయుధాలు తయారయ్యాయని చెప్పవచ్చు. పరిశోధన చేస్తే ఇనుప లోహయుగము నాటి అనేక విషయాలు తెలిసే అవకాశం ఉందని రత్నాకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# జనగామలో ప్రజావాణి నిర్వహించిన కలెక్టర్

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారుల సమక్షంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి ప్రజావాణి నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవిన్యూ శాఖ 42, డిఆర్డిఓ 4, ఇరిగేషన్ 2, డిపీఓ 4, మొత్తం కలిపి ( 66 ) దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు, ఈ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా గతంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తు వివరాలు అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని వారికి సమాధానాలు పంపాలన్నారు. ప్రజావాణికి ప్రతి శాఖ జిల్లా అధికారి తప్పనిసరిగా సమయాభావం పాటించి హాజరుకావాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుమోహన్, కృష్ణవేణి, డిఆర్డిఓ జి. రామిరెడ్డి, ఎస్డిసి రాధిక, సిపిఓ ఇస్మాయిల్,



జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ ఎమ్మెల్సీకి క్షమాపణలు చెప్పాలి

**నాలుగేళ్లు అవుతున్న యావర్ రోడ్డు ఎందుకు విస్తరించడం లేదు..**

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో సోమవారం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణంతో పాటు, కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ ను పట్టణం లోనే అమలు చేయాలి. యావర్ రోడ్డు విస్తరించేందుకు ఎందుకు చొరవ చూపడం లేదు. జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్ ఒక్కరోజు రాజకీయ పబ్బం గడుపుకునెందుకు అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పై వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మాస్టర్ ప్లాన్ అమలుతో రైతులు తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ అమలు కోసం గ్రామ పంచాయితీలు తీర్మానాలు ఇచ్చా యంటు మున్సిపల్ చైర్ పర్సన్ చెప్పడంతోనే గ్రామాల సర్పంచ్ లు ఆందోళన చెంది ప్రజావాణికి వచ్చారని, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రెస్ మీట్లో మాట్లాడినందుకు కాదని వివరించారు. రైతుల పక్షాన కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తే ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని విమర్శించడం సరికాదని అన్నారు. రోడ్డు విస్తరణ కోసం కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని అన్నారు. నాలుగు గోడల మధ్య తీర్మానం చేశారంటూ జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ శ్రావణీ వాఖ్యానించడంపై మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పాలనను ప్రజలు గమనిస్తున్నారనీ రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని గిరి నాగభూషణం హెచ్చరించారు. మాస్టర్ ప్లాన్ ను గ్రామాల్లో అమలు చేయడంపై ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి వివరాలు ఇవ్వలేదని విమర్శించారు. ఇండస్ట్రియల్ జోన్, రిక్రియేషన్ జోన్ల లో ఏయే సర్వే నంబర్లు ఉన్నాయో చెప్పడం లేదని అన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మాస్టర్ ప్లాన్ లోని తిప్పన్న పేట, నర్సింగపుర్, కండ్లపల్లీ, తిమ్మాపూర్, హస్నాబాద్ లింగంపేట గ్రామాల్లో ఇండస్ట్రియల్, రిక్రియేషన్ జోన్లు తొలగించాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ



శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లేపల్లి దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, కౌన్సిలర్ నక్క జీవన్, తిప్పన్న పేట సర్పంచ్ మేరు గు రమ్య, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సిరాజొద్దిన్ మన్సూర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర రమేష్ బాబు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో సోమవారం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణంతో పాటు, కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**సావిత్రీ భాయి పూలే సేవా పురస్కార్-2023ను**

# అందుకున్న మెట్ట హరి కిరణ్

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** సావిత్రీ భాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకుని "వల్లూరి ఫౌండేషన్" జాతీయ అధ్యక్షులు



వి.ఆర్. శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో కరీంనగర్ లోని "ఫిలిం భవన్" లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సావిత్రీ భాయి పూలే సేవా పురస్కార్- 2023ను రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ గారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మెట్ట హరి కిరణ్ మాట్లాడుతూ అవార్డు అందుకోవడం పట్ల సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవార్డులు, సన్మానాలు, సత్కారాలు తనపైన మరింత బాధ్యతను పెంచాయని అన్నారు.

# ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

**కొత్తగూడెంలో ముదిరాజ్ నేతల బైక్ ర్యాలీ**

**సికింద్రాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** ముదిరాజ్ లంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నేతలు




అభిప్రాయపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం ముదిరాజ్ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్ -2023 ను రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నేతలు కాసాని వీరేష్ ముదిరాజ్, డా.రావుల జగదీశ్వర్ ప్రసాద్ ముదిరాజ్ లు ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో యువత అలర్ట్ గా ఉండి, కీలకంగా వ్యవహరించాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీలు సత్తన్న, ఆంజనేయులు, కౌన్సిలర్లు చంద్రహాస్, కోల ఎల్లయ్య, విశ్వనాథ్, గోపి, శ్రీనివాస్, నాయకులు పిట్టల నరసింహారావు, పిట్టల సాయిలు, సదానందం, సంపత్, రాజేశ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొడిమ్యాల జనవరి 09 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన కాడె శంకర్ గత నాలుగు రోజుల క్రితం మృతి చెందగా సోమవారం మల్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



సింగిరెడ్డి తిరుపతిరెడ్డి వసంత దంపతులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. 25 కిలోల సన్న బియ్యంతో పాటు 2100 రూ.ల నగదును అందజేసి భవిష్యత్తులో కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఇక్కడ భారాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు ఎం.డి. నజీరొద్దీన్, పట్టణ అధ్యక్షులు కొత్తూరి స్వామి, వార్డు సభ్యులు దీకొండ చంద్రశేఖర్, మొగిలి రాకేష్,మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు ఎండి శుఖూర్, నాయకులు కాయిత రాజు,మహంకాళి గంగరాజం,నాయిని అంజయ్య,బండి లక్ష్మి రాజం, నర్సింగరావు, నరహరి, మల్లేశం తదితరులున్నారు.

# సమాచార హక్కు కన్వీనర్‌గా వెంకటేశ్వర రావు

**సికింద్రాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** సమాచార హక్కు వికాస సమితి సికింద్రాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గా చింతల వెంకటేశ్వరావు ను నియమిస్తు సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డా.యరమాద కృష్ణారెడ్డి ఆదివారం నియామక ఉత్వర్వులు జారీ చేశారు. సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం ప్రజల్లో అవగాహన కల్పించడానికి కృషి చేస్తానని వెంకటేశ్వరరావు ఈసందర్భంగా మీడియాతో పేర్కొన్నారు.





చేనేత కార్మికుల సంఘం ఆద్వర్యంలో చేనేత కార్మికులకు రుణాలు ఇవ్వాలని పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ కు వినతిపత్రం సమర్పణ. పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు మంగళంపలి జనార్దన్, మచ్చ బాల్ నర్సయ్య, దోర్నాల కుమార్.

# మెగా ఈవెంట్‌లా మారుతున్న కోడి పందాలు!



ఏటా సంక్రాంతి పండగకు ముందు కోడిపందాలపై వివాదం చెలరేగుతూనే ఉంది. తమిళనాట జల్లికట్టు... మనదగ్గర కోడిపందాలు వివాదం సృష్టిస్తూనే ఉన్నాయి. ఎన్ని చర్యలు తీసుకున్నా వీటికి అడ్డుకట్ట పడడం లేదు. జల్లికట్టు ప్రాణాలమీదకు తెస్తున్నా అడ్డుకోవడం లేదు. సరికదా స్థానికంగా ఉన్ననేతలు మద్దతుగా నిలుస్తున్నారు. నిజానికి కోడిపందాలను నిషేధించాలన్న డిమాండ్ ఏటా వస్తున్నా నేతలే అందుకు అడ్డుపడి పందాలకు పరోక్షంగా ప్రోత్సాహాలు అందిస్తున్నారు. తాజాగా ఈ యేడు కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందేలకు అడ్డుకట్ట వేయాల్సిందే అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత రెండేళ్లుగా కరోనా పరిస్థితులు తీవ్రంగా ఉన్నా పందేలు మాత్రం ఆగలేదు. పోలీసులు పందేలాను కఠినంగా అణిచి వేస్తామని, చర్యలు తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో అసలు పందేలు ఉంటాయా ఉండవా అన్న సందేహం మరోమారు తెరపైకి వచ్చింది. కోడిపందేల సంస్కృతి బాగా వేళ్లూనుకున్న ప్రాంతాల్లో సంప్రదాయం మాటున పందేలును జూదంగా మార్చి లక్షలు వెనుకేసుకుంటున్నారు. రాజకీయ నేతల అండదండలతో నియోజకవర్గం వ్యాప్తంగా మండలాల్లోని పలు గ్రామాల్లో కోడిపందేలు ఆడించేందుకు స్థానిక నాయకులు వేగంగా తమ ప్రయత్నాలు ప్రారంభించారు. ఏటా కోడిపందేలు ఒక మెగా ఈవెంట్‌లా మారిపోతున్నాయి. పందేలు నిర్వహిస్తున్న ప్రాంగణం అంతా బస్సులు, కార్లతో నిండిపోవడం చూస్తే, ఎంత పెద్దఎత్తున పందేలు నిర్వహిస్తున్నారో అర్థం అవుతుంది. ఏటా జరుగు తున్న తంతును గమనిస్తే పెద్ద ఎత్తున కోడి పందాల నిర్వహిస్తున్నారని అర్థం చేసుకోవచ్చు. కోడి పందేలు నిర్వహిస్తున్న ప్రాంతాలపై అధికారులు దాడులు చేయడం కూడా ఏటా పరిపాటి వ్యవహారంగానే సాగు తోంది. ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పందేలా హడావిడి మొలయ్యింది. గోదావరి, కృష్ణాకు ఆనుకుని ఉన్న ఖమ్మం లోనూ పందేలాకు డిమాండ్ ఉంది. వరంగల్ జిల్లాలోనూ పలు ప్రాంతాల్లో పంఎదం కోళ్లను పెండం వ్యాపారాంగా మారింది. లోపాయికారిగా గుట్టుచప్పుడు కాకుండా అక్కడక్కడా పందాలు నిర్వహిస్తూ ఉంటారు. అయితే కోనసీమ వాసులను ఎవరిని అడిగినా కోడిపందెం లేనిదే సంక్రాంతి లేదంటారు. కోడిపందాల మజా అంటేనే పండగ అంటారు. తమిళనాడు వాసులకు జల్లికట్టు కూడా అలాంటిదే. గతంలో జల్లికట్టుకు సంబంధించి ఎంత రాద్దాంతం జరిగిందో ప్రజలు మరచి పోయి ఉండరు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేల నిర్వహణ విషయమై ఏటా ఎవరో ఒకరు కోర్టుకు పోవడం దానిపై ఉత్తర్వులు తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది ఎలా ఉంటాయో అన్నది ఇప్పుడు అందరిలో ఆందోళన కలిగిస్తోంది. కోడిపందేల నిర్వహణ కుదరదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై గతంలో ఎంపి రఘురామ కృష్ణంరాజు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఏటా ఆయన సుప్రీంకు వెళ్లడం తాత్కాలిక ఆదేశాలు తెచ్చుకోవడం, ఏటా పందాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బరులు లేకుండా కత్తి కట్టకుండా పందాలు నిర్వహించుకుంటే అభ్యంతరం లేదని గతంలో ఆదేశాలు కూడా వచ్చాయి. ఇదంతా మామూలే అన్న ధరోణిలో ఛోటామోటా నేతలు ఉన్నారు. అందుకే సంక్రాంతి కోడి కోసం ఎవరి ఏర్పాట్లలో వారున్నారు. ఎవరికి వారు సర్దిచెప్పుకుని పందెం కోళ్లను రెడీ చేస్తున్నారు. అందుకే సంక్రాంతి పందెంకోడి కాలు దువ్వుతోంది. బోతోంది. ఈ ఏడాది కూడా గతంలో మాదిరే పోలీసులు మాత్రం సంక్రాంతికి జరుగుతున్న కోడి పందేలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇప్పటి నుంచే నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. ముందస్తు అరెస్టులు చేస్తామని అంటున్నారు. పందాలు నిర్వహించవద్దంటూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. మరోవైపు కోడి పందేల నిర్వాహకులు మాత్రం ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోనూ వీటి నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రధానంగా డెల్టా, మెట్ట ప్రాంతాల్లోని నిర్వాహకులు పైరవీలు ప్రారంభించారు. సంక్రాంతి పండగ సందర్భగా జరిగే కోడిపందాలకు పశ్చిమ పెట్టింది పేరు. ఇక్కడ ఎన్ని అవాంతరాలు ఉన్నా పందాలు జరిగి తీరాల్సిందే అన్న రీతిలో సాగుతున్నారు. కోర్టు ఆంక్షలు ఉన్నా, పోలీసుల నిఘా పెరిగినా బరులు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బరులను సిద్ధం చేస్తున్నారు. ఓ పక్క పోలీసు యంత్రాంగం హెచ్చరికలు చేస్తున్నా.. మరోపక్క నిర్వాహకులు బహిరంగం గానే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సంక్రాంతి మూడు రోజులు 13 వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో లాడ్జిలు నిండిపోతాయి. గతేడాది కోడి పందాలు నిలువరించేందుకు భోగి పండుగ రోజు పోలీసులు విశ్వ ప్రయత్నం చేసినా చివరకు రాజకీయ నాయకుల ప్రభావం ముందు నిలవలేక చేతులెత్తేశారు. ఈ ఏడాది కూడా అదే జరుగుతుందనే ప్రయత్నాల్లో పందెంరాయుళ్లు ఉన్నారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ప్రత్యేకంగా కోళ్లను పెంచి వాటికి ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు. సంక్రాంతి సంప్రదాయం ముసుగులో కోడిపందేలు నిర్వహించే ప్రాంతాల్లో కోడి పందేలు లేకపోతే పండగ సరదా ఏముందన్న వాదన ఉంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా భోగిరోజు మాత్రం కోడికి కత్తి కట్టాల్సిందే. ఆంక్షల నేపథ్యంలో రహస్యంగా బరికట్టించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. ఇతర జిల్లాల నుంచి వచ్చే పందేగాళ్లకు తగిన సమాచారాన్ని ఎప్పటి కప్పుడు చేరవేస్తున్నారని తెలుస్తోంది. ఆయాచోట్ల బరులను లోపాయకారిగా సిద్ధం చేస్తున్నారు. ఆరగట్టిన చేపల చెరువులను పందేలకు వేదికలుగా మార్చు కోవాలనే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పందేలు నిర్వహణకు కొందరు ఇప్పటి నుంచి సిండికేట్‌గా ఏర్పడి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఏ విధంగా అడ్డుకట్ట వేస్తుందో చూడాలి. కోడిపందేలాను ఆపుతారా లేదా అన్నది చివరి నిముషం వరకు తేల్చరు. దీంతో ఏటా యధావిధి గానే ఎవరికి వారు బరులకు సిద్ధం కావడం కూడా పరిపాటిగా మారింది.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, "నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## మంచి మిత్రులు

ఒక బడిలో చంద్రప్రకాష్ అనే మంచి విద్యార్థి ఉన్నాడు. అదే బడిలో వెంకటేశ్వర్లు అనే మొండివాడు ఉన్నాడు. ఎప్పుడూ ఏదో ఒకటి చేయాలని మిత్రులతో అంటూ ఉండేవాడు. ఒకరోజు చంద్రప్రకాష్ కు లెక్కల సారు బాబురావు గారు మెచ్చుకొని, ఒక పెన్నును బహుమతిగా ఇచ్చాడు.

ఆ లెక్కలు చేస్తేనే కాదా నీకు ఆ సారు బహుమతి పెన్ను ఇచ్చాడు. నేను చేస్తే నాకు ఇస్తాడు. ఇందులో పెద్ద గొప్పేముంది అన్నాడు తీసేసినట్లు వెంకటేశ్వర్లు.

మిత్రమా వెంకన్న! నీవు అన్నట్లుగా నాకన్నా లెక్కలు బాగా చేసే నీకు ఎందుకు ఇయ్యలేదు. చెప్పు లెక్కలు చేయడం ఒక్కటే కాదు. ప్రతిభతో



పాటు మంచి గుణాలు కూడా ఉండాలని మా తాత కథల్లో చెప్పేవారు, తెలుసా ? అన్నాడు చంద్రప్రకాష్.

అవునవును. మా బాబాయి కూడా కథలు చెప్పేవాడు తెలుసా? ఏది అనుకుంటావో అది చేయాలి. అప్పుడే విజయలక్ష్మి వరిస్తుంది అని అన్నాడు వెంకటేశ్వర్లు.

సార్ సార్ అక్కడ వెంకటేశ్వర్లు చంద్రప్రకాశ్ లు ఏదో గొడవ చేసుకుంటున్నారు సార్ అన్నారు వీరయ్య, బాబురావు సార్ దగ్గరికి పోయి.

ఏందిరా చిన్న పిల్లలు మాదిరిగా వాదులాట అన్నాడు బాబురావు సారు, వారి వద్దకు వేస్తూనే. భవిష్యత్తులో ఈ వాదాలు పనికిరావు రా. మీరు చేసిన చదివే మీరు చెప్పిన చదివే మీరు చదివిన చదివే భవిష్యత్తులో మీకు తిండి పెడుతుంది, అన్నాడు బాబురావు సార్.

అది కాదు సార్ నేను లెక్కలు చేశావు కాబట్టి నీకు బహుమతి వచ్చింది అన్నాను. అన్నాడు వెంకటేశ్వర్లు. మరి మీ వాదనతో ఏమీ సాధించారు అన్నాడు వీరయ్య తలగోక్కుంటూ.

అదే వీరయ్య వీరిద్దరూ మంచి మిత్రులు అని తెలుసు కదా వాళ్లలో చదువు గురించి మాట్లాడుతున్నారు అన్నారు బాబురావు సార్. లెక్కలు చేయగానే సరిపోదు.

మంచిగా చేసే వెంకటేశ్వర్లు కాకుండా. చంద్రప్రకాష్ కు ఎందుకు బహుమతి ఇచ్చారు సార్ అన్నాడు వీరయ్య. నాకు అర్థమైతే లేదు సార్ అన్నాడు.

వెంకటేశ్వర్లు ఎవరు చెప్పినా చెప్పకున్నా సాధించే గుణం ఉందిరా వానిలో. నీలో అది కాస్త తక్కువ రా అందుకే ప్రోత్సహించాలని నీకు బహుమతి ఇచ్చాను. సరేనా పొండి పోయి ఆ పది లెక్కలు చేయండి అన్నాడు బాబురావు. అంతేనా సార్ అంటూ వీరయ్య చంద్రప్రకాష్ వెంకటేశ్వర్లు భుజాలపై చేయి వేసి, తరగతి గది వైపు పోయినారు.

– పెందోట వెంకటేశ్వర్లు
సిద్దిపేట

# తెలుగు సాహిత్యానికి పింగళి ఎనలేని సేవ

## జనవరి 10...పింగళి లక్ష్మీకాంతం జయంతి

అగ్రశ్రేణి కవిగా, విమర్శకులుగా, పరిశోధకులుగా, వక్తగా, సాహిత్యాచార్యులుగా ప్రసిద్ధి గాంచిన సాహితీ వేత్త ఆచార్య పింగళి లక్ష్మీకాంతం. ఆంధ్ర భోజుడు శ్రీ కృష్ణ దేవ రాయలు ఆస్థానంలోని అష్ట దిగ్గజ కవులలో ఒకరైన పింగళి సూరన వంశీయులు, తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి శిష్యులు, కుర్తాళం సిద్దేశ్వరి పీఠాధి పతులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారికి గురువులు పింగళి.

పింగళి లక్ష్మీకాంతం (జనవరి 10, 1894 – జనవరి 10, 1972)




ప్రసిద్ధ తెలుగు కవి. లక్ష్మీకాంతం అధ్యాప కులుగా, నటులుగా, కవిగా బహు ముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. పింగళి కాటూరి జంటకవులలో పింగళి ఆయనే. పింగళి లక్ష్మీకాంతం 1894, జనవరి 10 న కృష్ణా జిల్లా ఆర్తమూరులో వెంకట రత్నం, కుటుంబమ్మలకు జన్మిం చారు. రేపల్లెలో ప్రాథమిక విద్యా భ్యాసం, మచిలీ పట్నం లోని హిందూ ఉన్నత పాఠశాల, నోబుల్ కళాశాలలో చదివారు. మద్రాసు విశ్వ విద్యా లయంలో ఎం.ఏ. పట్టా పొందారు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రికి శుశ్రూష చేసి, సంస్కృతాం ధ్రాలలో బాగా పఠించి ఆ మహాను భావుల శిష్యులలో అగ్ర గణ్యుల య్యారు. కాటూరి వెంకటేశ్వర రావుతో కలసి ఆయన ఆంజనేయ స్వామిపై శతకం చెప్పారు. వీరిరు వురు జంట కవులుగా పలు చోట్ల శతావధా నాలు చేశారు. పాండవో ద్యోగ విజయములు, ముద్రా రాక్షసము నాటకాలలో ధర్మరాజు, రాక్షస మంత్రిగా పాత్రలు పోషించి పేరు పొందారు.

నోబుల్ కళాశాలకు చెందిన పాఠశాలలో ఆంధ్ర పండితుడిగా పని చేశారు. మద్రాసు విశ్వ విద్యాలయం లోని ప్రాచ్య పరిశోధన విభాగంలో కొంతకాలం పరిశోధన చేశారు. ఆంధ్ర విశ్వ కళా పరిషత్తులో, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఆంధ్రాచార్యులుగా, అధ్యక్షులుగా పని చేశారు.

1906లో ప్రారంభమైన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు కోర్సు 1931లో ప్రారంభమైనప్పుడు దానికి లెక్చరర్ గా, శాఖాధ్యక్షులు గా, పింగళి లక్ష్మీ కాంతంను నాటి ఉప కులపతి డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ పిలిపించి నియమించారు. 1949 వరకు అక్కడ పని చేసి, తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ స్థాపించాక తెలుగు భాషా ప్రతి నిధిగా చేరారు. విజయవాడ ఆకాశ వాణి కేంద్రంలో ప్రసంగాల విభాగా నికి ప్రయోక్తగా ఉన్నారు. 1954 – 1961 విజయవాడ ఆకాశవాణి కేంద్రం సలహాదారుగా పని చేశారు. హైదరాబాద్ కు బదిలీ చేస్తే ఉద్యో గమే వదులు కుంటామని భీష్మించు కుని కూర్చున్నారు.

తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుండి ఆహ్వానం అందుకుని అందులో చేరారు. అలా ఆంధ్రలోని ఉత్తమ విశ్వ విద్యాలయాల తెలుగు విభాగాలకు ఆయన పునాది వేశారు. తిరుపతిలో ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేస్తూనే తెలుగు మాధ్యమంలో డిగ్రీ స్థాయివరకు విద్యాబోధన అంశం, తెలుగు అకా డమీ రూపకల్పన తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు.

విశ్రాంత జీవితంలో మిత్రులు, శిష్యుల ప్రోద్బలంతో కొద్ది కాలమే పుస్తకరచన, ప్రచురణ చేపట్టారు. 75ఏళ్ళ వయసులో, ఆరు దశా బ్దాలు సహ జీవనం చేసిన నేపథ్యంలో, 1969లో సతీ వియోగం ఆయనను కుంగ దీసింది. సాహిత్య వ్యవహారాలు, అధికార సంఘాల, బాధ్యతలను చేపట్టినా, మనసు లోని బాధను మరచి పోలేక పొయ్యారు.

ఆంధ్ర సాహిత్య అకాడమీలో విశిష్ట సభ్యత్వం, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ గౌరవ డాక్టరేట్ బిరుదు అందుకున్నారు. 1970 నాటికి అనారోగ్యాలు ఆయనను వెంటాడాయి. అయితే చికిత్స కోసం1971 ఆగస్టులో తిరుపతి నుండి హైదరాబాద్ వెళ్ళారు. 1972 జనవరిలో సంక్రాంతికి ముందు తెలుగు సాహిత్య రంగంలో అవిరళ కృషి సల్పిన పింగళి లక్ష్మీ కాంతం1972 సంవత్సరం జనవరి 10 తేదీన ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

సాధారణంగా జయంతి, వర్ధం తులు ఒకేరోజు రావటం బహు అరుదు. అయితే పింగళి పుట్టిన రోజు, మరణించిన రోజు ఒక్కటే జనవరి 10 కావడం విశేషం.



-ఆర్కె సంగనభట్ల
9440595494

# మత్స్యరంగానికి పెరిగిన ప్రాధాన్యం

## ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్థిక లబ్ది

## చేపల ఉత్పత్తిలో దూసుకెళ్లేలా ప్రణాళికలు

**హైదరాబాద్,జనవరి 9:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అక్వాకల్చర్ అనేది కేవలం ఎపికి మాత్రమే పరిమితమైన వ్యాపారాంగా ఉండగా తెలంగాణలో కెసిఆర్ సర్కార్ తీసుకున్న చర్యలతో ఇప్పుడు మత్స్య కారులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. మత్స్యకార సంఘాలకు ఎంతగానో ప్రోత్సాహం అందిస్తున్నారు. వారు ఆర్థికంగా ఎదిగేలా చేస్తున్నారు. చేపల చెరువులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయక పోయినా ఉన్న చెరువుల్లో చేపలసాగు కలసి వస్తోంది. ఉమ్మడి ఎపిలో కోల్పోయిన ప్రాభవం మళ్లీ కళ్లముందు సాక్షాత్క రించింది. చేపల పెంపకం పెరిగింది. చెరువుల పునరుద్దరణ, నదుల్లో



నీటి లభ్యత కారణంగా గణనీయమైన మత్స్య సంపద పెరిగింది. మత్స్య పారిశ్రామిక రంగం తెలంగాణలో ఇంతగా వెనకబడిపోవడానికి ఏపీతో పోల్చినప్పుడుభిన్నమైన కారణాలు కనిపిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌కు పొడవైన సముద్రతీరంతోపాటు,బ్యాక్‌వాటర్స్, కొల్లేరు లాంటి సహజసిద్ధమైన సరస్సులు, ఉప్పునీటి కయ్యలు, బ్రాకిష్‌వాటర్స్‌లాంటి అనేకరకాలైన జలవనరులు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో కేవలం భూఉపరితల జలవనరులు మినహా చేపలపెంపకానికి మరే ఇతర వనరులు అందుబాటులో లేవు. తెలంగాణలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి ఇప్పుడు అనుసరిస్తున్న సంప్రదాయ చేపల పెంపకం విధానాలను ఒకవైపు ఆధునీకరించు కుంటూనే, మరోవైపున అక్వాకల్చర్ అభివృద్ధికి ముందుకు సాగాలి. తెలంగాణలో అక్వాకల్చర్ అభివృద్ధి పరిచేందుకు ఇప్పటికే అందుబాటులో ఉన్న 77 మధ్యతరహా, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు న్నాయి. వీటికి తోడుగా కృష్ణా, గోదావరి నదుల మీద నిర్మిస్తున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి అనుబంధంగా నిర్మిస్తున్న అనేక జలాశయాలు, పెద్దపెద్ద చెరువులు కూడా అందుబాటులోకి రాబోతు న్నాయి. ఇక్కడి మత్స్యకారులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ప్రగతి సాధించాలి. చేపలను,రొయ్యలను ఉత్పత్తి చేస్తే అనుబంధ రంగాల్లో ఉపాధి పెరగగలదని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. తెలంగాణలో గత కొన్నేళ్లలో చేపల ఉత్పత్తి పెరిగిందని అన్నారు. ఆక్వా అనగా రొయ్యల సాగు అన్నది బలపడింది. తెలంగానలో చేపల పెంపకం, రొయ్యల పెంపకం అంతరించిపోయింది. కేవలం ఆంధ్రానుంచి వచ్చే చేపలు, రొయ్యలే దిక్కయ్యాయి. నిజానికి ఈ పరిశ్రమకు చేయూతను ఇస్తే దేశం మొత్తానికి ఉత్పత్తులను అందించే సత్తా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉండేది. కానీ అలా జరగలేదు. ఇప్పుడు విడిపోయాక రెండు రాష్ట్రాల్లోనూ ఆక్వా కల్చర్ అన్న పదం వ్యాప్తిలోకి వస్తోంది. తెలంగాణలో చేపల పెంపకానికి ఇచ్చిన ప్రోత్సాహం కారణంగా చేపల, రొయ్యల పెంపకంతో అనేక వ్యాపారాలు ముడిపడి ఉన్నాయి. అక్వాకల్చర్ అభివృద్ధితో విస్తారమైన ఉపాధి, ఉద్యోగావకాశాలు, వ్యాపార, వాణిజ్య లావాదేవీలు, ఎగుమతులు, దిగుమతులు పెరగడం కాయంగా కనిపిస్తోంది. దీంతో గతంలో కన్నా ఎపిలో కూడా ఇప్పుడు ఆక్వా పరిశ్రమకు ప్రోత్సాహం పెరిగింది. ఆక్వాను పర్యావరణ ముప్పు లేనంత వరకు ప్రోత్సహించడం మంచిదే. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నదులు, సముద్రాల్లో సంప్రదాయ పద్ధతుల్లో చేపల పెంపకానికి భిన్నంగా ఆధునిక పద్ధతుల్లో, జన్యుమార్పిడితో మత్స్య సంపదను పెంపొందించే అక్వాకల్చర్ ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తు న్నారు. దీంతో ప్రజల ఆహరా సమస్య తీరగలదు. సముద్రజలాల్లో సహజసిద్ధంగా పెరిగిన మత్స్యసంపద ను వేగంగా కొల్లగొట్టడంవల్ల భూమి ఉపరితలం మీద అందుబాటులో ఉన్న జలవనరుల్లో చేపల పెంపకాన్ని ఉధృతం చేయడంతో ఆంధ్రాలో ఆక్వా కల్చర్ పెరిగింది. తెలంగాణ రాష్ట్రం కంటే ఉపరితల జలవనరుల విస్తీర్ణంలో చాలా వెనుకబడి ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేపల ఉత్పత్తిలోనూ, అక్వాకల్చర్ ఉత్పత్తిలోనూ దేశంలోనే అగ్రభాగంలో నిలిచింది. ఉపరితల జలవనరుల విస్తీర్ణంలో దేశంలోనే మూడవ స్థానంలో ఉన్న తెలంగాణ చేపల ఉత్పత్తిలో మాత్రం జాతీయ స్థాయిలో 8వ స్థానంలో వెనుకబడి పోయింది. తెలంగాణ ఏర్పడ్డ తరవాత సిఎం కెసిఆర్ ముందుచూపుతో మత్స్యకారులకు రాయితీలు ప్రకటించి చేపలు, రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహించారు. దీంతో గడిచిన ఏడేండ్లుగా చెరువుల్లో ఉచిత చేప పిల్లల చేపట్టింది. ఎం కేసీఆర్ చేస్తున్న ప్రతిపాదన తెలంగాణ మత్స్యపారిశ్రామిక రంగానికి ఒక దిక్సూచి లాగా పనిచేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు.

# దేశ రాజకీయ దిశను మార్చిన ఎన్టీఆర్

## రాజకీయాలో కొత్త ఒరవడికి శ్రీకారం - సరిగ్గా 40 ఏళ్ల క్రితం ఓ ప్రభంజనం

**హైదరాబాద్,జనవరి9:** ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాల దశదిశను మార్చిన ఎన్టీఆర్ ఓ ప్రభజంజనం సృష్టించి..దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసి .నేటికి 40 ఏళ్ల గడిచాయి. అయినా నేటికీ ఎన్టీఆర్ పాలనే ఆదర్శంగా ప్రకటనలు ప్రయత్నాలు సాగుతున్నాయి. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే తెలుగుదేశం పార్టీని జంఝామారుతంలా విస్తరింపచేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత దివంతగ ఎన్టీఆర్‌దే. ఆనాటి అవినీతి కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలించి..రాజకీయ యవనికపై కొతత చరిత్రరాశారు. 1983 జనవరి 9వ తేదీన తెలుగువారి చరిత్రలో మర్చిపోలేని రోజుగా లిఖించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడైన ఎన్టీ రామారావు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇదే రోజు తొలిసారిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికి సరిగ్గా 40 ఏళ్లు కావస్తోంది. కాంగ్రెస్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించారు. దేశంలో తెలుగువారి ఆత్మగౌరవ నినాదం ఆనాడు బలపడేలా చేశారు. అంతరకు మదరాసీలుగా గుర్తింపు పొందిన తెలుగువారు తొలసారిగా తెలుగువారుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇందిరాగాంధీకి తిరుగులేని రోజుల్లో రాజీకాయ పార్టీని పెట్టి ఆమెను ఎదిరించి రాష్ట్రంలో పాలనా పగ్గాలు చేపట్టిన ఎన్టీఆర్ దేశ రాజకీయాల్లో తన పేజీని లిఖించుకున్నారు. పార్టీ స్థాపించిన 9 నెలల వ్యవధిలోనే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో విజయం సాధించి ఏపీకి తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మొదటిసారి పోటీల్లోనే 200 సీట్లు సాధించిన ఘనత ఎన్టీఆర్‌ది. తర్వాత అంటే 1984 ఆగస్టు 15న నాందెండ్ల భాస్కర్‌రావు కారణంగా పదవిని కోల్పోయారు. ఫలితంగా జరిగిన ప్రజా ఉద్యమంలో నాదెండ్లతో పాటు అప్పటి గవర్నర్ రామ్‌లాల్ చరిత్రహీనులుగా నిలిచిపోయారు. నాటి వెన్నుపోటుకు ప్రజా పోరాటంతో నెలరోజుల్లోనే ఎన్టీ రామారావు గద్దె దింపగలిగారు. 1984 సెప్టెంబర్ 16న మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక కొంత కాలం తర్వాత అసెంబ్లీని రద్దు చేసి 1985 మార్చిలో ఎన్నికలకు వెళ్లి మరోసారి 200పైగా సీట్లు సాధించారు. మార్చి 9న మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇలా వరుసగా 1983,1984,1985లో మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు ఎన్టీ రామారావు. ఇక 1989 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 73 సీట్లకే పరిమితమై ప్రతిపక్ష నేతగా నిలిచారు. నేషనల్ ఫ్రంట్ స్థాపనలో ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారు. తిరిగి 1994 జరిగిన ఎన్నికల్లో మరోసారి 220 సీట్లు సాధించి విజయం సాధించారు. 1995లో రెండోసారి చంద్రబాబు పన్నిన కుట్రలో ఎన్టీఆర్ పదవీచ్యుతడయ్యారు. ఎన్టీఆర్ తన హయాంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా పేదలకు అన్నం పెట్టాలని తపించి కిలో రెండు రూపాయల బియ్యాన్ని ప్రవేశ పెట్టారు. 1983 ఏప్రిల్ 14న రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఆంధప్రాంతంలో మునసబు, కరణాల వ్యవస్థను, తెలంగాణలో పటేల్, పట్వారీ వ్యవస్థలను రద్దు చేశారు. వృత్తి విద్యా కళాశాలల్లో క్యాపిటేషన్ ఫీజు రద్దు చేశారు. అలాగే సీట్లను అమ్ముకోవడాన్ని నిషేధించారు. ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఎంసెట్‌ను తీసుకువచ్చారు. మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అలాగే మహిళలకు ఆస్తిలో సమానహక్కును కల్పించారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీసు చేయడాన్ని నిషేధించారు. దేవాలయాల్లో వంశపారంపర్య అర్చకత్వ విధానాన్ని రద్దు చేశారు. ఎస్సీలకు 1 శాతం, బీసీలకు 2 శాతం రిజర్వేషన్లు పెంచారు. కేంద్ర ప్రభుత్వం 73, 74వ రాజ్యాంగ సవరణలు చేయడానికి చాలా సంవత్సరాల ముందే ఎన్టీఆర్ అధికార వికేంద్రీకరణ చేశారు. తాలూకాలు, బ్లాక్‌లకు బదులు రెవెన్యూ మండలాలు, మండల పరిషత్‌లను ఏర్పాటు చేసి పాలనలో విప్వాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. జిల్లా, మండల పరిషత్, నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలకు మొదటిసారిగా ఎన్నికలు నిర్వహించారు. భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పేదలకు జనతా వస్త్రాల పథకాన్ని ప్రారంభించి సగం ధరకే దుస్తులను పంపిణీ చేశారు. ప్రధానంగా రాజకీయాల్లో ఎస్సీ,ఎస్టీలతో పాటు, బిసిలకు పెద్దపీట వేశారు. తన తొలిమంత్రివర్గంలో ఆర్థికమంత్రిగా దళితుడైన మహేంద్రనాథ్‌ను నియమించారు. ఇలా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో ఆయన పేరు నేటికీ రాజీయాల్లో మార్మోగుతూనే ఉంది.

### వార్ రూం కేసులో
# మరో కీలక పరిణామం
### మల్లు రవికి సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): టీ కాంగ్రెస్ వార్ రూం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. వార్‌రూమ్‌కి తానే ఇంచార్జ్ అని చెప్పుకున్న ఆ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవికి సైబర్ క్రైమ్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. 41 సీఆర్పీసీ కింద నోటీసులు జారీ చేసిన పోలీసులు ఈనెల 12న విచారణకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా తెలంగాణ కాంగ్రెస్ వార్ రూమ్ కేసులో భాగంగా సోమవారం 2గంటల పాటు సునీల్ కనుగోలును విచారించారు పోలీసులు. అతని స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేశారు. కాగా ఈ కేసుపై స్పందించిన మల్లు రవి టి.కాంగ్రెస్ వార్‌రూమ్‌కి తానే ఇంచార్జ్ అని చెప్పుకున్నారు. నోటీసులు ఇస్తే తనకు ఇవ్వాలని కానీ, సునీల్‌కు సంబంధం ఏంటని ప్రశ్నించారు? ఇందులో భాగంగానే 41 సీఆర్పీసీ కింద విచారణకు హాజరుకావాలని మల్లు రవికి నోటీసులు జారీ చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితను కించ పరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు చేశారని సునీల్ పై ఆరోపణలు ఉన్నాయి. ఈ రోజు దాదాపు రెండు గంటల పాటు విచారించిన పోలీసులు.. సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన వివరాలను సునీల్ నుంచి సేకరించినట్లు తెలుస్తోంది. మరోసారి సునీల్‌ను విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణ అనంతరం బయటకు వచ్చిన సునీల్ మీడియాతో మాట్లాడటానికి నిరాకరించాడు.

# కాళేశ్వరంపై సుప్రీంలో ఊరట
### మూడో టీఎంసీపై గత ఉత్తర్వులకు సవరణలు

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): కాళేశ్వరం ప్రాజెక్టు మూడో టీఎంసీ పనులపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. మూడో టీఎంసీపై గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు సవరించింది. జస్టిస్ కేఎం



జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం స్టేటస్ కో ఉత్తర్వులను తుది తీర్పు వచ్చేలోపు అనుమతులపై నిర్ణయం తీసుకునేలా సవరిస్తూ.. మూడో టీఎంసీ అనుమతుల విజ్ఞప్తుల పరిశీలనకు గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీకి అనుమతి ఇచ్చింది. ఎది ఉత్తర్వుల మేరకే అనుమతులు లోబడి ఉంటాయని ఈ సందర్భంగా ధర్మాసనం తెలిపింది. అయితే, సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు కట్టుబడి ఉంటామని విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ప్రాజెక్టుకు భూములు ఇవ్వదలచుకున్న రైతులకు కోర్టు అనుమతి ఇచ్చింది. మూడో టీఎంసీని వ్యతిరేకిస్తూ గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. చెరువకు శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తితో పాటు పలువురు రైతులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, రాజకీయ కారణాలతో కాళేశ్వరానికి అడ్డుపడుతున్నారని ప్రభుత్వం వాదనలు వినిపించింది.

# టీకొట్టు వద్ద మంత్రుల హడావిడి
### చాయ్ తాగుతూ ఎంజాయ్

జనగామ,జనవరి9(ప్రజామంటలు): నిత్యం బిజీ బిజీగా ఉండే రాజకీయ నేతలు, మంత్రులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు చిరు వ్యాపారుల దగ్గర ఆగి వారి కష్ట సుఖాలు తెలుసుకుంటూ..కొద్దిసేపు వారితో సమయం కేటాయిస్తారు. రాజకీయ ఒత్తిళ్లు, సవాలక్ష సమస్యలతో సతమతమయ్యే నేతలు అప్పుడప్పుడు రోడ్డు పక్కనే బిజినెస్ చేసే చిరు వ్యాపారులను కలిసి..వారు తయారు పదార్థాలను తిని సంతోషపడుతుంటారు. ఇలా చేయడం వల్ల కాస్త వారికి రిలీఫ్ దొరికినట్టు అవుంది. చిరు వ్యాపారులను ప్రోత్సహించినట్టు అవుతుందని భావిస్తారు. ఇదే తరహాలో జనగామ జిల్లాలో మంత్రులు సందడి చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని ఓ టీ స్టాల్ లో రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు ,సత్యవతి రాథోడ్,ఎంపీ మాలోతు కవిత సందడి చేశారు. పాలకుర్తి పట్టణంలోని కాటాబత్తిని సోమేశ్వర్ టీ స్టాల్ లో టీ తాగారు. కొద్దిసేపు అక్కడే వెయిట్ చేసి పాన్ తింటూ ప్రజలతో ,ప్రజా ప్రతినిధులతో ,పార్టీ నాయకులతో కాసేపు ముచ్చటించారు నేతలు. ఒకేసారి మంత్రులు, ఎంపీ కనిపించడంతో అటువైపు వెళ్లే ప్రజలు వారిని చూసేందుకు ఎగబడ్డారు. అక్కడికి చేరుకున్న ప్రజలు, కార్యకర్తలకు అభివాదం తెలియజేస్తూ చిరునవ్వుతో పలకరిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థినికి అస్వస్థత
### 108 అంబులెన్స్‌లో అస్పత్రికి తరలింపు

నిర్మల్,జనవరి9(ప్రజామంటలు): జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైంది.వెంటనే 108 అంబులెన్స్‌లో అస్పత్రికి తరలించారు. ప్రస్తుతం స్టూడెంట్ పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలుస్తోంది. మధ్యాహ్నం 3 గంటలు దాటిన విద్యార్థులకు భోజనం పెట్టలేదు. దీంతో నీరసించి పోయిన విద్యార్థిని సొమ్మసిల్లిపడిపోయింది. సైన్స్ ఫేర్ లో మంత్రులు, ప్రజాప్రతినిధుల ఉపన్యాసాలతో భోజనం ఆలస్యం అయినట్టు తెలుస్తోంది. కిర్గుల్ బి గ్రామంలో7వతరగతి చదువుతున్న సంధ్యారాణి అస్వస్థత గురైందన్న విషయం తెలియడంతో వెంటనే ఉపాధ్యాయులు స్పందించారు. విద్యార్థినిని భుజాన వేసుకుని అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. ప్రజా ప్రతినిధుల ఉపన్యాసాలతో భోజనం ఆలస్యం అవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వాకౌట్ చేసిన గవర్నర్ రవి
### తమిళనాడు అసెంబ్లీలో గవర్నీర్ సొంత ప్రసంగం
### చెల్లదంటూ అసెంబ్లీలో డిఎంకె తీర్మానం

చెన్నై,జనవరి9(ప్రజామంటలు): తమిళనాడు అసెంబ్లీ నుంచి ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ రవి వాకౌట్ చేశారు. గవర్నర్ ప్రసంగం చేస్తున్న సమయంలో అధికార డీఎంకే కూటమి చెందిన సభ్యలు సోమవారం సభలో గందరగోళం సృష్టించారు. నినాదాలు చేస్తూ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎం స్టాలిన్ జోక్యం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాసి ఇచ్చిన ప్రసంగాన్ని మాత్రమే రికార్డులోకి తీసుకోవాలని, గవర్నర్ తన ప్రసంగంలో కొత్తగా జోడించిన అంశాలను తీసివేయాలని సీఎం స్టాలిన్ స్పీకర్‌ను ఆదేశించారు. రాష్ట్ర



ప్రభుత్వం రాసి ఇచ్చిన ప్రసంగాన్ని మాత్రమే గవర్నర్ ఒరిజినల్ స్పీచ్‌గా రికార్డు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేశారు. దీంతో మళ్లీ స్టాలిన్, గవర్నర్ మధ్య వైరం కొత్త స్థాయికి చేరినట్లు అయ్యింది. ఇటీవల తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, గవర్నర్ ఆర్ రవి మధ్య భిన్నాభిప్రాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే అసెంబ్లీ ప్రసంగంలో గవర్నర్ రవి.. ద్రవిడ నేతల గురించి ప్రస్తావించలేదు. అంబేద్కర్, ద్రవిడ మోడల్‌కు చెందిన విషయాలను ఆయన చదవలేదు. ప్రసంగంలో ఉన్న 65వ పేరాకు చెందిన స్పీచ్‌ను గవర్నర్ విస్మరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# బీఆర్ఎస్ అంటే భస్మాసుర సమితి
### 35వేల కోట్ల పంచాయతీ నిధుల దారిమళ్లింపు
### సర్పంచుల సమస్యలపై కాంగ్రెస్ ధర్నాలో రేవంత్

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): బీఆర్ఎస్ అంటే భస్మాసుర సమితి అని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. 35వేల కోట్ల పంచాయతీ నిధులను కేసీఆర్ సర్కార్ దారిమళ్లించిందని ఆరోపించారు. ఆ నిధులను మెఘా కృష్ణారెడ్డి, ప్రతిమ శ్రీనివాస్‌ల కాంట్రాక్టులకు బిల్లులు కట్టారన్నారు. సర్పంచుల సమస్యలపై ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ ధర్నా చేపట్టింది. నిధులు లేక కొందరు సర్పంచులు పుస్తెలు అమ్ముకుంటే, ప్రభుత్వం కాజేసిన నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. నిధులు రాకపోవడంతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న సర్పంచ్ కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయినా సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. చెట్టు సచ్చిపోతే సర్పంచ్ లను సస్పెండ్ చేస్తామన్న కేసీఆర్.. హైదరాబాద్ అభివృద్ధిపై



మరికొందరు బిచ్చమెత్తుకుంటున్నారని అన్నారు. సర్పంచులు అడ్డుకోవడం మానేసి..పోరాడాలని పిలుపునిచ్చారు. సర్పంచులపై పోలీసుల నిఘా ఉందని రేవంత్ ఆరోపించారు. రాష్ట్రంలో నిరసన తెలిపే అవకాశం కూడా లేదన్నారు. ఆస్తులమ్మి సర్పంచులు అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టారని.. వెంటనే కేటీఆర్‌ను సస్పెండ్ చేస్తారా అని రేవంత్ ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం అధ్వానంగా తయారుచేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్ లకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదని.. జీతాల కోసం 28వేల కోట్ల అప్పు తెచ్చారని చెప్పారు. రాష్టాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు.

# విడుదలయిన వృద్ధఖైదీకి సన్మానం
### శాలువా కప్పి సత్కరించిన జైలు అధికారులు

అయోధ్య,జనవరి9(ప్రజామంటలు): సాధారణంగా జైలులో శిక్ష అనుభవించే ఖైదీని.. అతడి శిక్ష పూర్తయిన వెంటనే అక్కడి నుంచి పంపేస్తారు. అతడికి సంబంధించిన వస్తువులను ఇచ్చి.. ఇంటికి సాగనంపుతారు. కానీ.. ఆ జైలులో మాత్రం ఐదేళ్ల శిక్ష అనుభవించిన ఓ వృద్ధ ఖైదీకి అధికారులు సన్మానం చేసి పంపించారు. ఉత్తరప్రదేశ్ అయోధ్యలో ఈ ఘటన జరిగింది. రామ్ సూరత్ అనే 98 ఏళ్ల వృద్ధుడు పలు కేసుల్లో దోషిగా తేలడంతో కోర్టు అతనికి ఐదేళు జైలు శిక్ష విధించింది. దీంతో అతను అయోధ్య జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇటీవలే శిక్ష పూర్తవడంతో అతను ఇటీవల విడుదలయ్యాడు. అయితే.. జైలు సూపరింటెండెంట్ శశికాంత్ మిశ్రా.. రామ్ సూరత్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. అతడిని శాలువాతో సన్మానించి.. కొంత నగదు ఇచ్చి పంపించారు.



నిజానికి రామ్ సూరత్ గతేడాది ఆగస్టు 8న విడుదల కావాల్సి ఉంది. కానీ మే 20న అతనికి కొవిడ్ నిర్ధారణ కావడంతో 90 రోజులు పెరోల్‌పై బయటకు వచ్చాడు. తాజాగా శిక్షాకాలం పూర్తవడంతో విడుదలయ్యాడు. దీనికి సంబంధించిన వీడియోను ఉత్తరప్రదేశ్ జైళ్ల శాఖ డీజీ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కరీంనగర్‌లో పట్టుకోసం బిజెపి యత్నాలు
### సవాళ్లు..ప్రతి సవాళ్లతో వేడెక్కిన కరీంనగర్

కరీంనగర్,జనవరి9(ప్రజామంటలు): ఉత్తర తెలంగాణలో టిఆర్ఎస్‌కు పట్టున్న కరీంనగర్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రంగా మారింది. బిజెపి దూకుడుగా



వ్యవహరిస్తోంది. మొత్తంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయ వేడి అందుకుంది. బండి విమర్శలు ప్రధానంగా టిఆర్ఎస్ అవినీతిపైనే సాగింది. సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. బండి సవాళ్లకు టిఆర్ఎస్ కూడా ఘాటుగానే స్పందించింది. దమ్ముంటే నిరూపించాలంటూ టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రతిసవాల్ చేస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు కరీంనగర్ పోరు గల్లుగా మారుతోంది. ఎన్నికల నాటికి ఇది మరింత ఉధృతం కానుందనడంలో సందేహం లేదు.

ఇంతకాలం టిఆర్ఎస్ చెప్పిందే వేదంగా రాజకీయాలు నడిచాయి. అలాగే తెలంగాణ సెంటిమెంట్‌తో నెట్టుకొచ్చారు. కానీ ఆ పప్పులు ఉడకవని దుబ్బాక, జిహెచ్‌ఎంసి,హుజూరాబాద్ ఫలితాలు తేల్చడంతో బిజెపి దూకుడు రాజకీయాలు చేపట్టింది. ఎమ్మెల్యేల అవినీతి, భూకబ్జాలపై ప్రధానంగా దృష్టి సారించింది. అలాగే వరదనష్టంపైనా నిలదీసింది. ఏవీ డబుల్ ఇళు అంటూ ప్రశ్నించింది. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఎన్నికలకు ముందే బిజెపి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటుందని భావిస్తున్నారు.

# కేంద్ర కేబినేట్ విస్తరణపై ఊహాగానాలు
### వచ్చే ఎన్నికలు లక్ష్యంగా టీమ్‌ను పటిష్ఠం చేసే పనిలో మోడీ
### తెలంగాణ నుంచి కొత్తగా ఒకరిద్దరికి చోటు అంటూ వార్తలు

న్యూఢిల్లీ,జనవరి9(ప్రజామంటలు): కేంద్రమంత్రి వర్గ విస్తరణపై ఊహాగానాలు జోరందుకున్నాయి. వరుసగా జాతీయ మీడియాలో కూడా దీనిపై ప్రచారం సాగుతోంది. 9 రాష్ట్రాల అసెంబ్లీ, 2024 సార్వత్రిక ఎన్నికలు, మంత్రుల పనితీరు ఆధారంగా ప్రధాని నరేంద్రమోడీ త్వరలోనే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరించనున్నట్లు తెలుస్తోంది. మంత్రుల పనితీరు ఆధారంగా కొందరిని తొలగించి మరికొందరికి అవకాశం ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. జనవరి 15 నుంచి 25వ తేదీ మధ్య మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు తెలుస్తోంది. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, రానున్న అసెంబ్లీ ఎలక్షన్లను దృష్టిలో పెట్టుకుని ప్రధాని ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.



గుజరాత్‌లో బీజేపీ ఘన విజయం సాధించినప్పటికీ మోడీ మాత్రం అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. కొందరు మంత్రులు, పార్టీ ఆఫీస్ బేరర్ల పనితీరు ఆశాజనకంగా లేదని భావిస్తున్న ప్రధాని కేబినెట్ మార్పు అంశాన్ని తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఎజరాత్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినా హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. ఈ పరిస్థితుల్లో హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మినిస్టర్లు తమ పదవులు ఉంటాయా ఊడతాయా అన్న ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు 2024 ఎన్నికలే లక్ష్యంగా కొత్త కేబినెట్ కూర్పు ఉంటుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఈ ఏడాది కర్నాటక, చత్తీస్ ఘడ్, త్రిపుర, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర 9 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాలకు కొత్త మంత్రివర్గంలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో మరో ఒకట్రెండు మంత్రి పదవులు కట్టబెట్టే సూచనలు ఉన్నాయి. నితీరు సరిగా లేని మినిస్టర్లను పక్కనబెట్టి.. వివిధ రాష్ట్రాల్లో స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్న వారికి సైతం కేబినెట్లో చోటు కల్పించాలని మోడీ భావిస్తున్నట్లు సమాచారం. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగే చివరి పునర్వ్యవస్థీకరణ కావడంతో మంత్రివర్గంలో చోటు కోసం పలువురు ఆశలు పెట్టుకున్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఎంపీలకు మంత్రులుగా ప్రమోషన్ వచ్చే అవకాశముంది. దీంతో పాటు మహిళా మంత్రుల సంఖ్యను పెంచాలని మోడీ భావిస్తున్నట్లు సమాచారం.

# సర్పంచుల హక్కులు కాలరాస్తున్నారు
### నిధుల దారిమళ్లింపు దారుణం
### ధర్నాచౌక్ ఆందోళనలో జీవన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): రాష్ట్రంలో సర్పంచుల హక్కులను కాలరాశారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని సర్పంచుల హక్కులను కాలరాస్తున్నారని జీవన్‌రెడ్డిఆయన ఆరోపించారు. ఎర్రబెల్లికి మంత్రి వర్గంలో కొనసాగే హక్కు లేదన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. చెట్లు పెరగకపోతే సర్పంచులను సస్పెండ్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో ఉన్న నిధులను ట్రెజరీకి చూపించి రాష్ట్ర ప్రభుత్వం రుణాలు పొందేందుకు ప్రయత్నిస్తోందన్నారు. సర్పంచులను అరిగోస పెడ్తున్న సీఎం కేసీఆర్‌కు పాపం తగుల్తదని సర్పంచులు అన్నారు. ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు తమ ఆవేదనను పంచుకున్నారు. నిధులు రాక, అప్పులు కట్టలేక ప్రాణాలు తీసుకునే పరిస్థితి కల్పించారని యాచారం మండలం చింతబట్ల సర్పంచ్ అక్కిపాండు రంగారెడ్డి వాపోయారు. మొదటి ఏడాది చెక్ పవర్ ఎవరికీ ఇవ్వకుండా కాలం గడిపిన ప్రభుత్వం ఆ తర్వాత కూడా సర్పంచులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు కలిపి చెక్ పవర్ ఇచ్చినట్లే సీఎంకు, డిప్యూటీ సీఎంకు కలిపి చెక్ పవర్ ఇస్తే బాగుండేదనని అన్నారు. కేసీఆర్ హయాంలో సర్పంచులే కాదు.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జెడ్పీ ఛైర్మన్ లు కూడా కష్టంగానే బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి అమ్ముకున్న డబ్బులుంటే 9 నెలల్లో రూ.40లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశానని అక్కి పాండు రంగారెడ్డి వాపోయారు. ఉప సర్పంచ్ ఉద్యోగం వచ్చి వెళ్లిపోవడంతో ఏడాదిన్నరలో రూ.50లక్షలు ఖర్చు చేసినా ఇప్పటికీ బిల్లులు ఇవ్వలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్పంచుల పరిస్థితి అధ్వానంగా ఉందన్న ఆయన.. వారు తమ పరిస్థితిని ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారని, చాలా మంది బాధతో పార్టీ మారుతున్నరని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సర్పంచుల పదవీకాలం మరో ఏడాది పెంచాలని పాండు రంగారెడ్డి కోరారు. కార్యక్రమంలో కోదండరెడ్ఇ, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 6లక్షలు రైతుబంధుపొందిన మల్లారెడ్డి
### మాజీ ఎంపి బూరనర్సయ్య గౌడ్ ఆరోపణ

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ సీనియర్ నేత బూర నర్సయ్య గౌడ్ అన్నారు. 98 లక్షల మంది రైతులు ఓట్లు వేస్తే 50లక్షల మందిని కేసీఆర్ వంచించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం రూ. 6వేల కోట్లు ఇస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 600 ఎకరాలు ఉన్న మంత్రి మల్లారెడ్డికి రూ.6 లక్షల రైతుబంధు నిధులు ఇస్తున్నారని బూర విమర్శించారు. ఆయిల్ ఫాం కోసం కేంద్ర ఇస్తున్న రూ. 20లక్షల సబ్సిడీని తామే ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని అన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని బూర నర్సయ్య గౌడ్ కోరారు.రూపాయికి కిలో బియ్యం, రైతుబంధు తప్ప కేసీఆర్ కు ఏమీ కనబడటం లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్రం ప్రభుత్వం రూ.20వేల కోట్లు ఇస్తోందన్నారు.కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలో వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులను బీజేపీ తయారు చేస్తుందని, నేతలను కొనదని చెప్పారు.

### జూన్ 7 నుంచి 9 వరకు
# అన్ని జిల్లాల్లో ఫుడ్ ఫెస్టివల్
### మహిళా మత్స్యకారుల శిక్షణ కార్యక్రమంలో తలసాని

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చేపల మార్కెటింగ్, చేపల




వంటకాల తయారీపై నిర్వహించే శిక్షణను మహిళా మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని నిథమ్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళా మత్స్యకారుల శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జూన్ 7 నుంచి 9 వరకు అన్ని జిల్లాల్లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని చెప్పారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారని తెలిపారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో మత్స్య సంపద మూడింతలు పెరిగిందని వెల్లడించారు. పెరిగిన సంపదను మత్స్యకారులకే అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొత్తగా 1.30 లక్షల మంది మత్స్యకారులకు సభ్యత్వం కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో దేశ విదేశాలకు చేపలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని స్పష్టం చేశారు.

# వనస్థలి దోపిడీ కేసులో కొత్త ట్విస్ట్
### 2 కోట్లు హవాలా డబ్బుల గల్లంతు

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): నగరంలోని వనస్థలిపురం దోపిడీ కేసులో కొత్త ట్విస్ట్ నెలకొంది. రూ.2 కోట్లు దోపిడీ అయినట్లు అధికారులు గుర్తించారు. హవాలా డబ్బులే దోపిడీకి గురైనట్లు పోలీసులు తేల్చారు. అమెరికా నుంచి ప్రవీణ్ పంపుతున్న డబ్బులు హైదరాబాద్‌లో మార్పిడి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రియాసత్‌నగర్‌లోని ఫారుఖ్‌కు హవాలా డబ్బులు చేరుతున్నాయి. అమెరికా నుంచి ఇప్పటివరకు ఫారూఖ్‌కు రూ.28 కోట్లు తీసుకొచ్చినట్లు గుర్తించారు. ఓ బార్ యజమాని వెంకట్‌రెడ్డి, షారుఖ్ కలిసి హవాలా లావాదేవీలు జరపుతున్నారు. పరారీలో ఉన్న షారుఖ్ కోసం పోలీసుల గాలింపు ముమ్మరం చేశారు.

# రైతులే కెసిఆర్‌ను గద్దె దింపుతారు
### కామరెడ్డి రైతులు కెఎ పాల్ సంఘీభావం

హైదరాబాద్,జనవరి9(ప్రజామంటలు): కామారెడ్డి అభివృద్ధి పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన మాస్టర్ ప్లాన్ దుర్మార్గంగా ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. బాధిత రైతులకు మద్దతుగా ఆయన కోర్టు విచారణకు హాజరయ్యారు. మాస్టర్ ప్లాన్ పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న కేసీఆర్‌ను అన్నదాతలే గద్దె దింపుతారని అన్నారు. మాస్టర్ ఎలాన్ కేసులో పార్టీ ఇన్ పర్సన్ గా పిటిషన్ వేసి వాదనలు వినిపిస్తానని కేఏ పాల్ స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతానన్న ఆయన.. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తానని తేల్చిచెప్పారు. ఇదిలా ఉంటే కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను వ్యతిరేకిస్తూ బాధిత రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మాస్టర్ ప్లాన్ ÷నైల్ చేయొద్దని స్పష్టం చేసింది. కేసును మధ్యాహ్నానికి పాస్ ఓవర్ చేసిన న్యాయమూర్తి అడ్వకేట్ జనరల్‌ను విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.



## విజ్ డమ్, విద్యా భారతి విద్యాసంస్థలలో
# ఘనంగా నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్

**కొడిమ్యాల జనవరి 09 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలోని విజ్ డమ్ విద్యా భారతి విద్యాసంస్థలలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించారు.



ఇందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల పిండి వంటలు 100 రకాలు తయారుచేసి వాటి గురించి వివరించారు. అదేవిధంగా హైస్కూల్ విద్యార్థినిలకు మెహందీ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం దీకొండ అశోక్, ఇక్బాల్ ఖాన్, వార్డు సభ్యులు దీకొండ చంద్రశేఖర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. వీటిని తిలకించడానికి వచ్చిన ఆహుతులు ఫుడ్ ఫెస్టివల్ ఎంతగానో ఆకట్టుకుందని హర్షం వ్యక్తం చేశారు.

# టీఎన్జీవో కేంద్ర సంఘ నాయకులకు సన్మానం

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్ మరియు ప్రధాన కార్యదర్శి రాయికంటి ప్రతాప్ ని హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో కేంద్ర సంఘ భవనంలో జగిత్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు



భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి లు మర్యాద పూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్ మాట్లాడుతూ టీఎన్జీవో సంఘం ఎప్పుడూ ఉద్యోగుల శ్రేయస్సు కోసం పని చేస్తున్నదని మరియు పెండింగ్ లో ఉన్న సమస్యలన్నీ కూడా పరిష్కారం అవుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు మరియు జిల్లా నాయకులు అమరేందర్ రెడ్డి, సాహెద్ బాబు, రవిచంద్ర, రవీందర్, మధుకర్, శైలజ పాల్గొన్నారు.

## కురుమ యువజన సంఘం
# నూతన క్యాలెండర్ (2023) ఆవిష్కరణ

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** జనగామ జిల్లా వడ్లకొండ గ్రామంలో కురుమ యువజన సంఘం నూతన క్యాలెండర్ ను జనగాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,కురుమ సంఘం రాష్ట్ర నాయకులు బాల్దే సిద్దిలింగం ముఖ్యఅతిథి గా



హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కురుమ యువజన సంఘం అధ్యక్షుడు మోటే రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాల్దె సిద్దిలింఘం మాట్లాడుతూ.... కురుమలు నీతికి,నిజాయితీకి మారు పేరు అని, మాట అంటే తప్పరని కొనియాడారు. కురుమలు ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారని, అదేవిధంగా కురుమలు రాజకీయంగా, విద్యాపరంగా అభివృద్ధి లోకి రావాలని పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శారద, బండ రవి, కురుమ యువజన సంఘం నాయకులు మోతె సత్యం, గోరిగే రమేష్, గుత్తి కుశాకర్, బోడ సత్తయ్య, కర్రీ రమేష్, కాసర్ల అశోక్, జూకంటి రాజు, జూకంటి మల్లేష్, గోరిగే మహేష్, కేమీడి రవి, చిన్నం శివ, రాసకొండ ఎల్లేష్, గొరిగే యుగెందర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవపురంలో నాలుగో విడత కరోనా,సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారథి కళాకారులు ప్రదర్శనలు. పాల్గొన్న తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ గట్టగల్ల సంజీవ, కారుపోతుల సోమయ్య, జనగాం శంకర్, బొమ్మెర రవి, పెనుమండ్ల సాంబయ్య, గడిపే బాలయ్య, ముక్కెర సంపత్, తిప్పర్తి శ్రీనివాసులు.

## మొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు
# ఫాతిమా షేక్ 192వ జయంతి వేడుకలు

**హుజూరాబాద్ జనవరి 09 (ప్రజామంటలు) :** హుజూరాబాద్ పట్టణంలో గ్లోబల్ షో టో కా న్ కరాటే డో ఇండియా కరీంనగర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో భారతదేశపు మొట్టమొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయులు చదువుల తల్లి ఫాతిమా షేక్ గారి 192 వ జయంతి కార్యక్రమం స్థానిక ఉర్దూ మీడియం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా తెలంగాణ రాష్ట్ర ఎస్టీ ఎస్సీ బీసీ మైనార్టీ రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, బి ఆర్ ఎస్ వై జిల్లా ప్రధాన కార్యదర్శి %ఽ% మాజీ ఏఎంసి డైరెక్టర్ మొహమ్మద్ ఖలీద్ హుస్సేన్, మహాత్మ జ్యోతిరావు పూలే కమిటీ చైర్మన్ కొలిపాక సమ్మయ్య పాల్గొన్నారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ సింథియా ఫర్రార్ అనే అమెరికన్ మిషనరీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో ఇద్దరూ చేరినప్పుడు ఫాతిమా షేక్, సావిత్రిబాయి పూలేను కలిశారన్నారు. వీరిద్దరి ఆలోచన విధానం ఒకే రకంగా ఉండడం వలన సమాజంలో జరుగు జరుగుతున్నటువంటి వివక్ష, మహిళలపై అగ్రవర్ణాలు చేసే దాడులు, మహిళలు చదువుకోవద్దని ఆంక్షలు ఆనాటి సమాజంలో దృఢంగా నిలిచాయి కాబట్టి వాటికి వ్యతిరేకంగా సావిత్రిబాయి పూలే మొట్టమొదటి పాఠశాల పూణేలో ఏర్పాటుచేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే అయితే అధ్యాపకులుగా ఫాతిమా షేక్ విద్యార్థులకు విద్య ను బోధించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా జ్యోతిరావు పూలే స్థాపించిన పాఠశాలలు వాటి అన్నింటిలో సావిత్రి బాయ్ పూలే, ఫాతిమా షేక్ కీలక పాత్ర పోషించారని, వారు ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ మహిళలు సాధికారక సాధించాలంటే అది కేవలం విద్యతోనే సాధ్యమవుతుందని గట్టిగా దృఢ సంకల్పంతో వెనుకడుగు వేయకుండా మహిళల్ని చైతన్య పరిచే విధంగా సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ ఇద్దరు దేశానికి సేవ చేశారని గుర్తు చేశారు. దుండగులు దాడి చేసిన వారి దాడిని ప్రతిఘటించి వారి జీవితం మొత్తం మహిళల విద్యాభ్యాసం, వితంతుల



పునర్వివాహల చట్టం కోసం సావిత్రిబాయి పూలే తో కలిసి ఉద్యమాలు జరిపి వితంతు పునర్వివాహ చట్టాన్ని అమలుపరిచే విధంగా కృషి చేసినటువంటి మొట్టమొదటి ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని వారి సేవలను గుర్తించి మహారాష్ట్రలోని పాట్నా ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ అహ్మద్, మిర్జా జియావుల్లా బేగ్, షేక్ బాబా, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నవీన్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రతి రైతు
# అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరికరాలు మాత్రమే వాడాలి

**జగిత్యాల 09 జనవరి (ప్రజామంటలు):** వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి ఏమనగా విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రతి రైతు ఐఎస్ఐ మార్కు కలిగిన మోటారు, హెచ్డిపిఈ పైపులు, ఐఎస్ఐ కెపాసిటర్, నాణ్యత కలిగిన సర్వీస్ వైర్లు, ఐఎస్ఐ మార్క్ స్టార్టర్లు తప్పనిసరిగా ఉపయోగించి, ప్రతి పరికరానికి రెండు వైపులా ఎర్తింగ్ చేయవలెను. ఇనుప పరికరాలకు ఎర్తింగ్ చేయడం వలన విద్యుత్ యాక్సిడెంట్ నివారించవచ్చు. పరికరాలకు డబల్ ఎర్తింగ్ చేయడం వలన అధిక రక్షణ పొందవచ్చు. మోటారు ఆన్ మరియు ఆఫ్ చేయడానికి ఉపయోగించే స్విచ్ బోర్డ్ వద్ద నేలపై కలపతో కానీ, రబ్బర్ మ్యాట్ చాపను పరిచి, చేతి తొడుగులు( గ్లౌస్), రబ్బరు షూస్ ఉపయోగించవలెను. మోటారు స్విచ్ బోర్డ్ లోని ప్యూజులకు 2%ఇ%33 గేజ్ సన్నటి టి.సి. ( టిన్నెడ్ కాపర్) ఫ్యూజ్ వైరును మాత్రమే వాడాలి. రబీ/యాసంగి సీజన్లో పంట వేసే ముందర నీళ్లల్లో మునిగిన విద్యుత్ మోటర్లు బయటకు తీసి సర్వీసింగ్ చేయించి, బేరింగ్లకు గ్రీసు పూసి, అన్ని భాగాలను సరి చేయించిన తర్వాతనే మోటర్లు ఆన్ చేయవలెను, లేనిచో మోటార్ల పైన అధిక భారము పడి మోటర్లు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయి నష్టము కలుగును. కంపెనీ వైండింగ్ వైర్ కాలిన మోటార్కు తిరిగి నాణ్యత కలిగిన వైర్ ని ఉపయోగించి రివైండింగ్ చేయించాలి, లేనిచో మోటర్ బాడీ షాక్ తగిలి విద్యుత్ ప్రమాదాలు జరిగి మనుషులకు, పశువులకు ప్రాణ నష్టం కలుగును, కావున ప్రతి రైతు జాగ్రత్తలు తప్పనిసరిగా



పాటించి విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలి. ప్రతి విద్యుత్ మోటారుకు 2 కెవిఏఆర్ కెపాసిటర్లు బిగించి, మోటార్లు వేడెక్కి కాలిపోకుండా చూడాలి, ఎక్కువ తక్కువ వోల్టేజ్ రాకుండా పంపుసెట్లును కేపాసిటర్ కాపాడుతుంది. రైతులందరూ కెపాసిటర్లను%ఱ% బిగించుకోవడం వలన మోటరు తక్కువ కరెంటు తీసుకుంటుంది, తద్వారా ట్రాన్స్ఫార్మర్ పై అధిక లోడ్ తగ్గి దగ్గరలో గల ట్రాన్స్ఫార్మర్ కాలిపోకుండా కాపాడుకోవచ్చు మరియు పంటలు నష్ట పోకుండా చూడవచ్చు. రైతులు విద్యుత్ మోటార్లకు ఆటో స్టాటర్లు వాడకూడదు. దీనివలన మోటర్లు ఒకేసారి ఆన్ అయ్యి, ట్రాన్స్ఫార్మర్ పైన ఒకేసారి అధిక లోడ్ పడి విద్యుత్ మోటారు మరియు ట్రాన్స్ఫార్మర్ కూడా కాలిపోవును. ఈ నెలలో సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆటో ట్రాన్స్ఫార్మర్లు తొలగిస్తున్నాము. కావున రైతులు అందరూ స్వచ్ఛందంగా తొలగించవలెను. లేనిచో సర్వీస్ వైర్ లు తొలిగించబడును. రైతులు అనధికారముగా, ట్రాన్స్ఫార్మర్ల ఫీజులు మార్చకూడదు, లైన్ పనులు చేయకూడదు. విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలిపినచో రిపేర్ చేయబడును. విద్యుత్ ప్రమాదకరం. కావున రైతులు విద్యుత్ వినియోగదారులందరూ తగు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలు రక్షించుకోవాలని జి. సత్యనారాయణ ఎస్ఈ-టిఎస్ఎన్పిడిసిఎల్ జగిత్యాల పత్రికా ప్రకటన చేశారు.

## ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు
# న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ పోరు

**ఏఐఎస్ఎఫ్ నాయకుల ముందస్తు అరెస్ట్**

**హుజూరాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ జిల్లా సహాయ కార్యదర్శి కేషబోయిన రాము యాదవ్ ను ముందస్తు అరెస్టు చేసి హుజురాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలేరని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.... దేహదారుఢ్య పరీక్షలో అనేక తప్పులు కొత్త నిబంధనలు తీసుకువచ్చి అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేశారని, అభ్యర్థులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ ఒంటెద్దు పోకడలతో ఇష్టానుసార నిర్ణయాలతో అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడన్నారు. ఎస్ ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు అనేక రకాలుగా మానసిక వేదనకు గురవుతున్నారని ప్రశ్నపత్రంలో తప్పిదాలు వచ్చాయని దాని ద్వారా లక్షలాది మంది అభ్యర్థుల జీవితాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తప్పుగా వచ్చిన ప్రశ్నలకు మార్కులు కలపాలని హైకోర్టు ఆదేశించిన పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. ఈవెంట్స్ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో పెంచడం జరిగిందని, పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఆయన కోరారు. రన్నింగ్ అర్హత పొందిన



అభ్యర్థులందరికి మెయిన్స్ అవకాశం కల్పించాలన్నారు. ప్రిలిమ్స్ ప్రాథమికి మల్టీపుల్ పరీక్షలో తప్పుగా వచ్చిన ప్రశ్నలకు మార్కులు కలపాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయని పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతి భవన్ ముట్టడి పిలుపు నివ్వగా ముట్టడి కార్యక్రమాన్ని వెల్లకుండా ముందస్తు అరెస్టు చేశారని అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం జరిగేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# భోగ నాగభూషణం ఇద్దరు కుమారులు మృతి, పరామర్శ

**మెట్ పల్లి జనవరి 09 (ప్రజామంటలు):** మెట్ పల్లి పట్టణంలో విషాదంలో మునిగిపోయిన మెట్ పల్లి వ్యాపారి భోగ నాగభూషణం ఇద్దరు కుమారులు ఒకేసారి గుండెపోటుతో మరణంతో వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి లింగం మండలాధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి పరామర్శించారు. మరణించిన వారికి ఆత్మ శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులు విషాదం నుండి త్వరలో కోలుకునే విధంగా ఆత్మ స్థైర్యం కల్పించాలని భగవంతుని కోరుకున్నట్లు తెలిపారు.



## జనగామ జిల్లా దివంగత
# కవుల క్యాలెండర్ కలెక్టర్‌కు అందజేత

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** కవులు కళాకారుల ఐక్యవేదిక, జనగామ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా దివంగత కవుల క్యాలెండర్ ను సోమవారం గ్రీవెన్స్ లో కలక్టర్ సి.హెచ్. శివలింగయ్య కు సంపాదకవర్గం అందజేసింది. ప్రముఖ వైద్యులు, కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి సహకారంతో ఇటీవల ముద్రించిన ఈ



క్యాలెండర్ ను అందజేస్తూ గత 6 మాసాలు కష్టపడి మరుగున పడిన ప్రతిభామూర్తులైన కవుల సమాచారం సేకరించామని ప్రధాన సంపాదకులు జి. కృష్ణ వివరించారు. తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా ఈ క్యాలెండర్ జనగామ నుండి వెలువడటం ఆనందంగా ఉందని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ క్యాలెండర్ ఉండాలని కలక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా కలక్టర్ సంపాదకవర్గం కృషిని అభినందించారు. అన్ని కార్యాలయాల్లో క్యాలెండర్ వేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్, ఆర్.డి.వో మధుమోహన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుగుణాకర్ రాజు, ఐక్యవేదిక కన్వీనర్ జి. కృష్ణ, కో కన్వీనర్ పెట్లోజు సోమేశ్వరాచారి, జనగామ రచయితల సంఘం అధ్యక్షులు అయిలా సోమనర్సింహచారి, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





హుజూరాబాద్ మండలం సింగపూర్ గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన యువ నాయకులు వొడితల ప్రణవ్. పాల్గొన్న సర్పంచ్ మంద మంజుల సమ్మిరెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు

## పెగడపల్లి లో నూతన గ్రంధాలయ భవనం ప్రారంభించిన
# మంత్రి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్

**పెగడపల్లి జనవరి 09 (ప్రజామంటలు):** మండల కేంద్రములో 2500000 రూ. లతో నూతన గ్రంధాలయ భవనమును ప్రారంభించిన సంక్షేమ శాఖ



మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్, జిల్లా గ్రంధాలయ చైర్మెన్ డా. గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్. ఈ కార్యక్రమం అనంతరం మంత్రి తో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోలి శోభ, జెడ్పీటీసీ రాజేందర్ రావు, పాక్స్ ఛైర్మన్ ఓరుగంటి రమణ రావు, గ్రంధాలయ సెక్రటరీ సరిత మరియు స్టాఫ్ కవిత, శంకర్, మోహన్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల కళాశాల,
# పాఠశాలలో సీట్లుకై దరఖాస్తు చేసుకోండి

**ప్రిన్సిపల్ తుంగూరి సుచిత్ర**

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలలో ఇంటర్, ఐదవ తరగతుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ గురుకుల ప్రిన్సిపల్ సుచిత్ర కోరారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో 2023-24 సంవత్సరానికి ఇంటర్ బైపిసి, ఎంపిసిలో సీట్లు ఉన్నాయని మైనార్టీ బాలికలు దరకాస్తూ చేసుకోవాలని కోరారు. అలాగే 5 వ తరగతిలోను కొత్త అడ్మిషన్లు జరుగనున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే 6, 7,8 తరగతుల్లో మిగిలిపోయిన మైనార్టీ సీట్లు ఉన్నాయని వీటికై ఈనెల 15 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. tmreis.telangana.gov.in ద్వారా కానీ, నేరుగా మైనార్టీ గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తుంగూరి సుచిత్ర కోరారు.



## బిజెపి దళిత మోర్చా
# పట్టణ ఉపాధ్యక్షులుగా మహేష్

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** భారతీయ జనతాపార్టీ దళితమోర్చా పట్టణ ఉపాధ్యక్షులుగా బొల్లారపు మహేష్ ను నియమిస్తూ పట్టణ అద్యక్షులు



నక్క జీవన్ నియామక పత్రం అందజేశారు. సోమవారం 12 వ వార్డులోని బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ బీజేపీ లో చురకైన కార్యకర్తగా పనిచేస్తున్న మహేష్ సేవలు దళితమోర్చా కు అవసరమని భావించి దళితమోర్చా పట్టణ ఉపాధ్యక్షుడిగా మహేష్ ను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. తన నియామకానికి కృషిచేసిన నక్క జీవన్, చిలకమర్రి మదన్ మోహన్లకు కృతజ్ఞతలు మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ఓరగంటి హరికృష్ణ, బొల్లారపు కళ్యాణ్ బాబు, కార్యదర్శి లింగంపల్లి పవన్, దళిత మోర్చా నాయకులు ఉన్నారు.

# ఎముకలు కీళ్ల నొప్పులకు ఉచిత పరీక్షలు

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** ఆదిత్య హాస్పిటల్ డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి వైద్య సేవలు ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా సోమవారం జనగామలో ఎముకలు కీళ్ల నొప్పులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఆదిత్య హాస్పిటల్ లో ప్రఖ్యాత ప్రముఖ అంతర్జాతీయ సంస్థ



సన్ ఫార్మాటికల్ ఇండస్ట్రీస్ ముంబై వారి సౌజన్యంతో ఎముకల జాయింట్ నొప్పులకు సంబంధించిన ప్రత్యేక ఉచిత శిబిరంలో బోన్ స్కానింగ్ పరీక్షలు చేశారు. సుమారు ఎనిమిది వందల రూపాయలు నుంచి 2000 రూపాయల విలువల పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా పరీక్షలు చేసుకుని ఎముకల దృఢత్వాన్ని పరిశీలించుకున్నారు. కొంతమందికి దృఢత్వం లేనందున అవసరమైన మందులను వాడాలని డాక్టర్ సూచించారు. ఈ శిబిరంలో డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి, జైన రమేష్, బద్రీనాథ్,రవి కిరణ్ రెడ్డి, మహంకాళి హరిచంద్ర గుప్త,అరుగుల శ్రీనివాస్, బుస్సా సిద్దేశ్వర, సన్ ఫార్మాటికల్ ఇండస్ట్రీస్ సంస్థ తోట రాజు, వినయ్ టెక్నీషియన్, హాస్పిటల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నమడూర్‌లో
# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** జనగామ జిల్లా చిన్నమడూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2005-06 పదవ తరగతి విద్యార్థిని విద్యార్థుల



అపూర్వ సమ్మేళనం జనగామ పట్టణం లోని గ్లోరీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు తమ అనుబంధాలను పంచుకున్నారు. విద్యార్థులు చిన్నతనంలో తమ మధురనుభూతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య బుద్దులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, నరసింహులు, భగవాన్ రెడ్డి, కాజ,రామ్మూర్తి, రవీందర్, ఉపేందర్, లలిత బాలసిద్దులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు కుమారస్వామి, భాస్కర్, విజయ్, వెంకటేష్, సాగర్, సంపత్, సతీష్, వెంకటేష్, ప్రవీణ్ మరియు ఉపేందర్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అపూర్వ సమ్మేళనానికి కొంతమంది విద్యార్థులు విదేశాల నుండి రావడం గమనార్హం.

# యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

**జనగామ జనవరి 09 (ప్రజామంటలు):** అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జనగామ జిల్లా చిల్పుర్ మండలం కొండపూర్ గ్రామంలో యాదవులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చిల్పూర్ మండల అద్యక్షులు కొండా కనకయ్య యాదవ్ అద్వర్యంలో ముఖ్య అతిథిగా జిల్లా అద్యక్షులు బానుక సిద్దిరాజ్ యాదవ్ పాల్గొన్నారు. సర్పంచ్ లోడం రజిత్



రవిందర్ యాదవ్, ఎం.పి.టి.సి. మారబోయిన అయిలమ్మ ఏల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. జిల్లా అద్యక్షులు సిద్దిరాజ్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా లోని కొండాపూర్ గ్రామంలో యాదవులనుండి మహిళ సర్పంచ్, మహిళ ఎంపిటిసి ఉండడం యాదవులకే ఆదర్శమని, స్పూర్తి అన్ని గ్రామాల్లో యాదవులు రాణించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రదాన కార్యదర్శి మారబోయిన సమ్మయ్య యాదవ్, సహాయ కార్యదర్శి సంపత్ యాదవ్, డీలర్ రాజుకొమురయ్య యాదవ్, బుసా శ్రీను యాదవ్, గాలి మహేందర్ యాదవ్, కొండ శామ్ యాదవ్, గుండేబోయిన రవి యాదవ్, మారబోయిన కుమార్ యాదవ్, రవి యాదవ్ ఎల్.ఐ.సి. రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పిల్లలకు చేయూత

### ఫిబ్రవరి 15 వరకు స్కాలర్షిప్పులకు దరఖాస్తులు స్వీకరణ

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** కార్మికుల పిల్లల చదువులకు చేయూత నిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా విద్యా ప్రోత్సాహకము కింద స్కాలర్షిప్పులు మంజూరు చేస్తోంది.ఇందులో భాగంగా 2022-2023 సంవత్సరానికి స్కాలర్షిప్పులు అందించడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కార్మిక శాఖ కోరుతుంది.2023 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.ఈ పథకం పై చాలా మంది కార్మికులకు,వారి పిల్లలకు అవగాహన లేక గత ఏడాది జగిత్యాల జిల్లాలో ఒక్క విద్యార్థి కూడా దరఖాస్తు చేసుకోలేదని అధికారులు పేర్కొంటున్నారు.ఈ పరిస్థితిలో తెలంగాణబీసీ కార్మిక జెఏసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ కార్మికుల,వారి పిల్లల సమాచారం కోసం ఇలా వివరించారు.



**అర్హులు వీరే.**

దుకాణాలు, సంస్థలు, సహకార సంఘాలు, కర్మాగారాలు, మోటారు రవాణా సంస్థలు, ధర్మాదాయ ఇతర సంస్థల్లో పని చేస్తూ కార్మిక సంక్షేమ నిధికి జమ చేసే కార్మికుల పిల్లలు స్కాలర్షిప్పులు పొందడానికి అర్హులు. కార్మికుని నెల వేతనం రూ .16 వేలకు మించరాదు.

**ప్రోత్సాహకము ఇలా...**

పదోతరగతి, ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు రూ.1000, పాలిటెక్నిక్ రూ.1500, ఇంజినీరింగ్, మెడిసిన్, న్యాయ విద్య,బీ ఎస్సీ అగ్రికల్చర్, రూ.2000, బీఎస్సీ హార్టికల్చర్ , బి.ఎం.ఎం.ఎస్, బి.డి.ఎస్, డి.ఎం.ఎల్.టి.బివిఎస్ సి, బి.ఫార్మసీ బి.సి.ఏ., ఎం.సి.ఏ, ఎం.బి.ఏ, డి.హెచ్.ఎం.ఎస్, చదువుతున్న విద్యార్థులకు రూ.2000 ఇస్తారు. దివ్యఅంగుల విద్యార్థులకు సంవత్సరంనకు రూ.4000 వంతున మంజూరు చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీ శాఖల ద్వారా పొందుతున్న స్కాలర్షిప్పులతో పాటు అదనంగా కార్మిక సంక్షేమ మండలి నుంచి పొందవచ్చునని హరి అశోక్ కుమార్ వివరించారు.

# 10 ఏండ్లుగా నిర్విరామ సేవ అభినందనీయం

### సొంత డబ్బులతో అనాధల ఆకలి తీర్చడం గొప్ప విషయం

### 220 వ ఫుడ్డు డ్రైవ్ లో పాల్గొన్న లక్ష్మీరెడ్డి

**సికింద్రాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** ఎలాంటి లాభాపేక్ష లేకుండా, కనీసం విరాళాలు సేకరించకుండా తమ సంపాదనలో కొంత డబ్బును సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ, 10 ఏండ్లుగా



రోడ్ల పక్కన ఫుట్ పాత్ లపై దుర్భర జీవితం గడుపుతున్న వారి ఆకలి తీర్చుతున్న స్కై ఫౌండేషన్ ఆర్గనైజర్స్ అభినందనీయులని మిత్ర హోలిస్టిక్ సొసైటీ సెక్రటరీ, సామాజిక సేవకురాలు భూమిరెడ్డి లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. పద్మారావునగర్ కు చెందిన స్కై ఫౌండేషన్ 220 వ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఈసందర్భంగా ఫౌండేషన్ చేపట్టిన సేవా కార్యక్రమాల తీరును కొనియాడారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న వాలంటీర్లు ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం గొప్ప విషయమన్నారు. ఆదివారం వచ్చిందంటే ఎంజాయ్ చేద్దామనుకునే ఈ రోజుల్లో యంగర్స్ ఇలా సేవ ప్రోగ్రామ్ ల్లో ఉత్సాహంగా పాల్గొనడం అరుదు అని అన్నారు. అనాధల ఆశ్రమం ఏర్పాటు లక్ష్యంగా సాగుతున్న ఫౌండేషన్ సంకల్పానికి తమ వంతు



సాయం అందిస్తామన్నారు. ఈసందర్భంగా సిటీలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనున్న అనాధలకు ఫుడ్డు ప్యాకెట్లను అందచేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు ప్రవళిక, సరస్వతి, చిన్నారి ప్రాచి, అఖిల్, నిశాంత్, సాకెత్, జతిన్, శుభం పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ముందు
# మాస్టర్ ప్లాన్ ముసాయిదాకు నిరసనగా వివిధ గ్రామ రైతుల నిరసన ధర్నా

**జగిత్యాల 09 జనవరి (ప్రజామంటలు):** తమ వ్యవసాయ భూముల సర్వే నెంబర్ల ను జగిత్యాల మున్సిపల్ మాస్టర్ ప్లాన్ లో రిక్రియేషన్, ఓపెన్ ప్లేస్ పార్క్ జోన్, ఇండస్ట్రియల్ జోన్ ల కు కేటాయిస్తూ జారీ చేసిన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ను సవరించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల రూరల్ మండలం గ్రామల రైతులు సోమవారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మున్సిపల్ అధికారులు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మా భూములను మున్సిపల్ మాస్టర్ ప్లాన్ లో రిక్రియేషన్, ఓపెన్ ప్లేస్ పార్క్ జోన్, ఇండస్ట్రియల్ జోన్ ల కు కేటాయిస్తారు అని అన్నారు. ప్రభుత్వ భూములు ఉండగా రైతుల భూములను లాక్కునే చర్యచేపడితే ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ చూస్తూ ఊరుకోమని అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతామని రైతుల కోసం పోరాడుతామని రాబోయే రోజులలో ఇలాగనే



వివరిస్తే ధర్నాలు రాస్తారోకాలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

### కలెక్టర్ జి. రవి

**జగిత్యాల జనవరి 09 (ప్రజామంటలు):** ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలు, దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి.రవి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మందా మకరంద్, హాజరై ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజావాణి సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ లో ఉన్న అర్జీలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. రెవెన్యూ, భూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కాగా ఈరోజు ప్రజావాణికి



మొత్తం 16 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతంగా ఆనాటి మెట్లబావి

### చారిత్రక మెట్లబావి సందర్శనకు తరలి వస్తున్న జనాలు

**సికింద్రాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** నిజాం కాలంలో నిర్మించిన మెట్లబావి (నాగన్నకుంట) నేడు పర్యాటక కేంద్రమైంది. రాత్రుళ్ళు వెలుగు జిలుగుల మద్య సినిమా సెట్టింగ్ ను



తలపిస్తోంది. ఒకప్పుడు తాగునీటికి వినియోగించిన మెట్లబావి తదనంతరం వినియోగంలో లేక చెత్తా, చెదారంతో నిండిపోయి మురికి కూపంగా మారింది. జీహెచ్ఎమ్సీ, హెచ్ఎండీఏ, రెయిన్ వాటర్ ప్రాజెక్ట్, సాహి సంస్థలు సమిష్టిగా 16 నెలల పాటు శ్రమించి, పునరుద్ద పనులు చేపట్టగా, అలనాటి మెట్లబావి నేడు ఒక అద్భుత కళాఖండంగా వెలుగుతోంది. నెల కిందట మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ లు ప్రారంభించగా ప్రస్తుతం మెట్లబావిని చూడడానికి సిటీ నుంచే కాకుండా దూరప్రాంతాల నుంచి ప్రజలు క్యూ కడుతున్నారు. వారంలో సోమవారం ఒకరోజు మూసి ఉంచే మెట్లబావిని మిగితా 6 రోజులు ఉదయం 10 నుంచి మద్యాహ్నం 1 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 వరకు రూ. 50 టిక్కెట్ తో సందర్శనకు అనుమతినిస్తున్నారు. గండిపేట వెల్ఫేర్



సొసైటీ నిర్వహణ బాధ్యతలు చేపట్టగా, మెట్లబావిని సందర్శిస్తున్న ఔత్సాహికులు ఇక్కడున్న ఫొటో, ఆనాటి వస్తువులను భద్రపరిచిన గ్యాలరీ, మెట్లబావి లోన ఫొటోలు దిగుతూ, ఎంజాయ్ చేస్తున్నారు. ఇక్కడి పచ్చని గడ్డితో కూడిన పార్కు (లాన్), యాంపీ థియేటర్, ఫొటో గ్యాలరీ, మెట్లబావి లోన లైటింగ్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విజిటర్స్ ఆనాటి గుర్తులను సజీవంగా చూస్తూ, తన్మయం చెందుతున్నారు.



ఎస్.ఐ. , కానిస్టేబుల్ నియామక ప్రక్రియపై ప్రగతిభవన్ ముట్టడిలో భాగంగా ముందస్తుగా జనగామ డివిపి నాయకులు జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్‌లను జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఉచిత వైద్య శిభిరాల నిర్వహణ బేష్

### సినీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల

**సికింద్రాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి మందులను ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని




ప్రముఖ సినీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల అన్నారు. ఆదివారం ఫస్ట్ సోర్స్ కంపెనీ సీఎస్ఆర్ లో భాగంగా నిర్మాన్ ఆర్గనైజేషన్ వారు కృష్ణనగర్ లోని ఎవర్ గ్రీన్ హాల్ లో ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దాదాపు 500 మందికి వివిద వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, ఎస్.ఆర్.డీ ప్రతినిధి శివరాణి, ఇందిరా, భారతి డా. రాజేశ్, డా. అపర్ణ, ఉషాకర్ కీర్తి, వైద్యులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ స్కీంలు

### మంత్రి తలసాని

### 46 మందికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందచేత

**సికింద్రాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** ఏ రాష్ట్రంలో లేని తెలంగాణ లో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్ట్



మారేడ్ పల్లి లోని తన నివాసంలో 46 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం క్రింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పేదింటి ఆడపడుచు పెండ్లికి లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన అనేక రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. ఆడపడుచు పెండ్లి అంటే పేదలకు ఎంతో భారమని, ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం వారికి కొంత ఆసరా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమం క్రింద లక్షలాది మందికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లు హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ, ఆకుల రూప, సికింద్రాబాద్ తహసిల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప శరణు ఘోషలతో మారుమోగిన అడ్డగుట్ట

### శబరియాత్రకు బయలు దేరిన అయ్యప్పస్వాములు

**సికింద్రాబాద్ జనవరి 09 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ లోని అడ్డగుట్ట ప్రాంతం అయ్యప్ప శరణు ఘోషలతో మారుమోగింది. స్థానిక శ్రీధర్మశాస్త్ర



సేవా సమితి ఆధ్వర్యంలో కన్య, కత్తి, ఘంట, గదా, గురుస్వాములు మొత్తం 50 మంది గత 41 రోజుల పాటు కఠిన నియమాలతో అయ్యప్ప దీక్షలు ఆచరించారు. సోమవారం అడ్డగుట్ట నుంచి ఆట, పాటలు, అయ్యప్ప నామ సంకీర్తనాలతో నృత్యాలు చేస్తూ వీరంతా స్వామి వారి దర్శనానికి శబరి యాత్రకు బయలు దేరారు.

## సి.ఐ., ఎస్.ఐ. ఆధ్వర్యంలో
# రజక సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

**మల్లాపూర్ జనవరి 09 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండల రజక సంఘం నూతన క్యాలెండర్ ను సీ.ఐ. లక్ష్మి నారాయణ, ఎస్సై నవీన్



కుమార్ లు ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు బండపెల్లి నర్సయ్య, లక్ష్మి రాజ, జంబుక రమేష్, కొడిమ్యాల రాజేందర్, గురువయ్య, దేవరాజం, మల్లయ్య, నారాయణ, వినీల్, సంఘం నాయకులు పాల్గొన్నారు.





# వెండితెరపై సంక్రాంతి సందడి

## బాలయ్య, చిరుల సినిమాల జోష్

## 12న వీరసింహారెడ్డి, 13న వాల్తేరు వీరయ్య

ఈ సంక్రాంతికి వెండితెర సందడి అప్పుడే మొదలై పోయింది! గత మూడేళ్ల నుంచి కరోనా నిబంధనల కారణంగా సంక్రాంతికి పెద్ద సినిమాలు అంతగా రాలేదు. దాంతో చిన్న చిత్రాల మధ్య పండగలు గడిచి పోయాయి. ఈ ఏడాది చిరంజీవి, బాలకృష్ణ సినిమాలు సిద్ధం కావడంతో వారి అభిమానుల్లో ఆనందం ఉరకలేస్తోంది. సంక్రాంతికి ప్రతి ఏటా పెద్ద హీరోల సినిమాలు థియేటర్లలో సందడి చేయడం ఆనవాయితీగా వస్తోంది. చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ 'వీర సింహారెడ్డి' ఈసారి సందడి చేయనున్నాయి. ఈ రెండింటి నిర్మాణ సంస్థా మైత్రీ మూవీసే కావడం గమనార్హం. ఈ రెండు సినిమాల ప్రచారం ఉవ్వెత్తున సాగుతోంది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ల నుంచి పాటలు, టీజర్ల వరకూ ప్రతి ఒక్కటీ నువ్వా నేనా అనే విధంగా సాగుతున్నాయి. 40 ఏళ్ళలో ఈ హీరోల సినిమాలు దాదాపు 17సార్లు పోటీ పడ్డాయి. కొన్నిసార్లు బాలయ్య పైచేయి సాధిస్తే.. కొన్నిసార్లు చిరంజీవి పైచేయి సాధించారు. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత వీరి సినిమాలు సంక్రాంతి బరిలో నిలవడంతో ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. సినిమా ప్రమోషన్లు పోటాపోటీగా భారీ స్థాయిలో జరుగుతున్నాయి. దర్శకుడు గోపిచంద్ తీసిన బాలయ్య సినిమా జనవరి 12న రిలీజ్ అవుతుండగా.. చిరంజీవి సినిమా 13న విడుదల చేస్తున్నారు. ఈ రెండు సినిమాల్లో శృతిహాసన్ హీరోయిన్‌గా నటించడం గమనార్హం. దర్శకుడు బాబి తీస్తున్న 'వాల్తేరు వీరయ్య'లో మాస్ హీరో రవితేజ కీలకపాత్ర పోషించడంతో సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. తమిళ అగ్రహీరో లైన విజయ్, అజిత్ సినిమాలు విడుదలకు సిద్ధమయ్యాయి. వీరి సినిమాలూ గతంలో సంక్రాంతి బరిలో 9 సార్లు పోటీపడ్డాయి. 8 ఏళ్ల తర్వాత మళ్లీ పోటీ పడటంతో వారి అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. విజయ్ 'వారిసు', అజిత్ 'తునివు' సినిమాలు జనవరి 11న రాబోతున్నాయి. ఇవి తెలుగులోనూ ' వారసుడు', ' తెగింపు' టైటిళ్లతో వస్తున్నాయి. ఇందులో వారసుడు రిలీజ్ డేట్‌ను నిర్మాత దిల్‌రాజు 14కు మార్చారు. కుటుంబ కథా చిత్రంగా రూపొందిన విజయ్ 'వారసుడు'ను తెలుగు దర్శకుడు వంశీ పైడిపల్లి తెరకెక్కిస్తు న్నారు. ఇందులో రష్మిక హీరోయిన్‌గా నటించారు. పూర్తి యాక్షన్‌గా తెరకెక్కిస్తూ హెచ్ వినోద్ దర్శకత్వంలో అజిత్ సినిమా 'తెగింపు' వస్తుంది. ఇందులో మంజు వారియర్ హీరోయిన్‌గా నటించారు. దాంతో నగరాలు, పట్టణాల్లో పెద్ద థియేటర్లు ఈ నలుగురు హీరోల సినిమాలు సందడి చేస్తున్నాయి. హీరో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ హీరోహీరోయిన్లుగా నటించిన 'కల్యాణం కమనీయం' 14న విడుదల కానుంది. సినిమా రిలీజ్ అవుతోంది. దోస్తాన్, ప్రత్యర్థి, ఎ జర్నీ టు కాశీ, మైఖేల్ గ్యాంగ్ లాంటి చిన్న సినిమాలు కొన్ని థియేటర్లలోకి వస్తున్నాయి. ఇప్పటికే ఈ పెద్ద సినిమాలు బిజినెస్ పరంగా రికార్డులు నెలకొల్పుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో చిన్న సినిమాలు విడుదల చేయడం పెద్ద సాహసమే. మొత్తంగా ఈ సంక్రాంతికి తమ అభిమాన హీరోల సినిమాలు విడుదల కావడంతో థియేటర్లు కలర్‌ఫుల్‌గా ఉండబోతున్నాయి.





## వారసుడు 11న కాదు..14న విడుదల

### స్పష్టత ఇచ్చిన నిర్మాత దిల్ రాజు

సంక్రాంతి కానుకగా జనవరి 11వ తేదీన విడుదల కావాల్సిన వారసుడు సినిమాను 14వ తారీకున విడుదల చేయబోతున్నట్లుగా దిల్ రాజు అధికారికంగా ప్రకటించాడు. గత కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చకు దిల్ రాజు మీడియాముందు తెర దించాడు. సంక్రాంతి వారసుడుగానే మా సినిమాను తీసుకు రాబోతు న్నట్లుగా పేర్కొన్నాడు. చిరంజీవి,యు బాలకృష్ణల సినిమాలు ఉన్న కారణంగానే వారసుడు సినిమాను వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించాడు. పెద్ద హీరోలకు థియేటర్లు అసవరం కనుక ఆ సినిమాలు విడుదల యిన తరవాత 14న విడులకు నిర్ణయించామని అన్నారు. అయితే తమిళ వర్షన్ ను మాత్రం ప్రపంచ వ్యాప్తంగా జనవరి 11న విడుదల చేయబోతున్నట్లుగా స్పష్టం చేశాడు. నేను గత కొన్ని రోజులుగా నా మనసులో ఈ విషయాన్ని అనుకుంటున్నాను. నా చుట్టు ఉన్న వారు.. నా ఆఫీస్ వారు ఈ విషయాన్ని రెండు మూడు రోజుల క్రితమే లీక్ చేశారు అంటూ దిల్ రాజు వ్యాఖ్యలు చేశాడు. తెలుగులో చిరంజీవి, బాలకృష్ణ పెద్ద హీరోలు. వారికి సాధ్యం అయినన్ని ఎక్కువ థియేటర్లు లభించాల్సి ఉంది. అందుకే వారి సినిమాల తర్వాతే నా సినిమా విడుదల కావాలనే ఉద్దేశ్యంతో జనవరి 14న నా వారసుడు సినిమాను తీసుకు రాబోతున్నట్లుగా పేర్కొన్నాడు.



మా బ్యానర్ లో గతంలో వచ్చిన సంక్రాంతి ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ మాదిరిగానే ఈ సినిమా కూడా తప్పకుండా తెలుగు ప్రేక్షకులను అలరిస్తుందని దిల్ రాజు నమ్మకం వ్యక్తం చేశారు. కొందరు సినిమాను వాయిదా వేయాల్సిన అవసరం ఏంటీ.. అక్కడ 11 కు విడుదల అయ్యి.. ఇక్కడ 14కు విడుదల చేస్తే ఎలా అన్నారు. తప్పకుండా ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేస్తుందని దిల్ రాజు అన్నాడు. ఇది ఒక పాజిటివ్ నోడ్ తోనే చేస్తున్నట్లుగా దిల్ రాజు పేర్కొన్నాడు. అందరు నిర్మాతలు లాభపడాలి.. అందరు డిస్టిబ్యూటర్లు కూడా లాభాలను దక్కించుకోవాలి అనే ఉద్దేశ్యంతో వారసుడు తెలుగు వర్షన్ ను మూడ్రోజులు వాయిదా వేస్తున్నామని అన్నారు.



## గ్రాండ్‌గా వాల్తేరు వీరయ్య ప్రీ రిలీజ్ ఫంక్షన్

### శృతి గైర్హాజరుపై చిరు వివరణ

బాబీ డైరెక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి, శృతిహాసన్ నటించిన మూవీ వాల్తేరు వీరయ్య సంక్రాంతి కానుకగా ఈ నెల 13న రిలీజ్ కానుంది. విశాఖ ఆర్కే బీచ్‌లో ఆదివారం రాత్రి ఈ మూవీ ప్రీ రిలీజ్ ఫంక్షన్ అట్టహాసంగా జరిగింది. చిరంజీవి,రవితేజ హాజరయ్యారు. అయితే హీరోయిన్ శృతిహాసన్ ఫంక్షన్ కు అటెండ్ కాలేదు. అయితే తనకు జ్వరం వచ్చిందని..కొవిడ్ టెస్టు కూడా చేయించుకున్నానని శృతిహాసన్ సోషల్ మీడయాలో ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ రెండు రోజుల క్రితం బాలయ్య వీరసింహారెడ్డి ఫంక్షన్ కు వచ్చి వాల్తేరు వీరయ్యకు అటెండ్ కాకపోవడంపై చర్చనీయాంశంగా మారింది. అయితే నిన్నవేదికపై మాట్లాడిన చిరంజీవి శృతిహాసన్ రాకపోవడంపై సెటైర్లు వేశారు. ' ఆ అమ్మాయి శృతిహాసన్.. మరి ఒంగోలులో ఏం తిన్నదో తెల్వదు జ్వరం వచ్చిందంట.. లేక ఎవరైనా బెదిరించారో తెల్వదు. ఫోన్ చేసి తనకు జ్వరం వచ్చింది. కొవిడ్ టెస్ట్ కూడా చేయించుకున్నా సారీ అంటూ చెప్పింది. ఈ సినిమాలో శృతిహాసన్ చాలా బాగా చేసింది. గ్లామర్ తో పాటు, యాక్షన్ సీన్ లో కూడా బాగా చేసింది. మైనస్ 8 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా చాలా చక్కగా డ్యాన్స్ చేసింది. శృతిహాసన్ ప్రొఫెషనలిజానికి హ్యాట్సాప్ ' అంటూ చిరు వ్యాఖ్యానించారు. ఈ మూవీలో పవర్ ఫుల్ పోలీస్ పాత్రలో రవితేజ కనిపించబోతున్నారు. ఇందులో కేథరిన్, బాబీ సింహా, నాజర్ తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు.



దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బ్జడెట్ తో నిర్మించింది. ఇటీవలె రిలీజైన ఈ మూవీ ట్రైలర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. గాడ్ ఫాదర్ తర్వాత చిరు నటిస్తున్న మూవీ కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి.

## శాకుంతలం ట్రైలర్ విడుదల

### ఫిబ్రవరి 17న విడుదలకు ముహూర్తం ఫిక్స్



గతేడాది 'యశోద'తో భారీ విజయం సాధించిన సమంత.. ఈ ఏడాది అదే జోష్‌తో 'శాకుంతలం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. గుణశేఖర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మహాశివరాత్రి కానుకగా ఫిబ్రవరి 17న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లు సినిమాపై విపరీతమైన అంచనాలు నెలకొల్పాయి. శకుంతల, దుష్యంతుడి ప్రేమ కథను వెండితెరపై గుణ శేఖర్ ఏ విధంగా చూపిస్తాడో అని ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. కాగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న శాకుంతలం ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు.లేటెస్ట్‌గా రిలీజైన ట్రైలర్ విజువల్ ఫీస్ట్‌లా అనిపిస్తుంది. 'ఈ భూమ్మీద అమ్మానాన్నలకు అక్కర్లేని తొలి బిడ్డ.. మేనకా విశ్వామిత్రుల ప్రేమకు గుర్తుగా ఈ బిడ్డ పుట్టింది'. 'శకుంతల ఒక కారణ జన్మురాలు.. నవ నాగరికతకు నాంది పలకబోతోంది' అనే డైలాగ్స్ సమంత పాత్రను ఎలివేట్ చేస్తున్నాయి. 'మాయ ప్రేమను మరిపిస్తుందేమో.. అభిమానాన్ని, అవమానాన్ని ఏ మాయ మరిపించలేదు' అంటూ సమంత పలికిన సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. మణిశర్మ సంగీతం మంచి ఫీల్ ఇస్తుంది. యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ అన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయి. ఇక ట్రైలర్ చివర్లో సింహం మీద అల్లు అర్హ ఎంట్రీ మాత్రం విజిల్స్ వేసేలా ఉంది. ఎట్టకేలకు ఫిబ్రవరి 17న ఈ సినిమాను 3డీలో రిలీజ్ చేస్తున్నట్లు ఇటీవలే మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించింది. దిల్‌రాజు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. మలయాళ నటుడు దేవ్ మోహన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను గుణశేఖర్ 'రుద్రమదేవీ' తర్వాత దాదాపు ఏడేళ్ళు టైం తీసుకుని ఈ సినిమాను తెరకెక్కించాడు.

## సమ్మర్ కానుకగా హనుమాన్

ప్రయోగాత్మక సినిమాలను తెరకెక్కించడంలో సిద్ధ హస్తుడు ప్రశాంత్ వర్మ. 'అ!' సినిమాతో సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చిన ప్రశాంత్ వర్మ.. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత 'కల్కి', 'జాంబిరెడ్డి' వంటి వరుస విభిన్న చిత్రాలతో ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకున్నాడు. ప్రస్తుతం ఈయన యంగ్ హీరో తేజసజ్జాతో 'హను మాన్' అనే సూపర్ హీరో చిత్రాన్ని చేస్తున్నాడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. ఇప్పటికే చిత్రబృందం రిలీజ్ చేసిన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా మే 12న ప్రేక్షకులు ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. అంతేకాకుండా ఈ సినిమా పాన్ వరల్డ్ స్థాయిలో రిలీజ్ కాబోతుంది. తెలుగు సహా 11 భాషల్లో ఈ సినిమా విడుదల కానున్నట్లు చిత్రబృందం తెలిపింది. అందులో కొరియన్, జపనీస్, ఇంగ్లీష్, స్పానీష్, చైనీస్ భాషలు కూడా ఉన్నాయి. ఒక తెలుగు సినిమా ఇన్ని భాషల్లో రిలీజవడం ఇదే తొలిసారి. కంటెంట్ మీదున్న నమ్మకంతో భారీ ఎత్తున ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. నిజానికి ప్రశాంత్ వర్మ ఒక్క టీజర్‌తోనే సినిమాపై విపరీతమైన అంచనాలు నెలకొల్పాడు.సూపర్ హీరో ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తేజ సజ్జాకు జోడీగా అమృత అయ్యర్ నటిస్తుంది. వరలక్ష్మి శరత్ కుమార్ కీలకపాత్ర పోషిస్తుంది. డాక్టర్ ఫేం వినయ్‌రాయ్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. ప్రైమ్ షో ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాడు. అయితే ఈ సినిమాకు హక్కులకు భారీ డిమాండ్ ఉన్నట్లు తెలుస్తుంది. కేవలం హిందీ డబ్బింగ్ రైట్స్ రూపంలోనే ఈ సినిమాకు దాదాపు 10 కోట్లు వచ్చాయని తెలుస్తుంది.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com